ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com
RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

## కాళేశ్వరంతో లక్షకోట్లు ప్రజాధనం వృధా

రాజ్యసభలో కేంద్రమంత్రి పాటిల్ వ్యాఖ్యలు

➤ 2వ పేజిలో..

TUESDAY 31ST MARCH 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 08 ISSUE : 358 COST : 3\- KHAMMAM, TELANGANA

మంగళవారం 31 మార్చి 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 358 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ



- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 30 (అక్షరం న్యూస్) ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా

➤ మిగతా 2వ పేజిలో..



## చర్చల ద్వారా సమస్యల పరిష్కారం

- ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు
- సమాంతర ప్రభుత్వాలు నడిడిపిన మావోయిస్టులు
- నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన

న్యూఢిల్లీ మార్చి 30 (అక్షరం న్యూస్) చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. మావోయిస్టుల

➤ మిగతా 2వ పేజిలో..

## లాకర్ వస్తువులకు బీమా సౌకర్యం కుదరదు

- లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ మార్చి 30 (అక్షరం న్యూస్) బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ కుదరదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. లాకర్లలో దాచిన వస్తువులను బ్యాంకు అధికారులు చూడరని, వాటిని రికార్డు చేయరని స్పష్టం చేశారు. కాబట్టి విలువ ఆధారంగా బీమా కవరేజీ అందించడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఈ అంశాన్ని (ఃజీన్గ్ ÷నీఃషీ!సబ) లేవనెత్తగా ఆర్థిక మంత్రి దీనిపై స్పందించారు. 'లాకర్లలోని వస్తువులను బ్యాంకు సిబ్బంది తనిఖీ చేయలేరు. అలా చేయడం బ్యాంకు రూల్స్‌కి విరుద్ధం. ఆర్‌బీ

➤ మిగతా 2వ పేజిలో..

## ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన



హైదరాబాద్, మార్చి 30 (అక్షరం న్యూస్) ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు

➤ మిగతా 2వ పేజిలో..

## అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

- సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్ • బిల్లును వ్యతిరేకించిన బిజెపి

హైదరాబాద్, మార్చి 30 (అక్షరం న్యూస్) తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసంగాలకు చెక్ పడనుంది. మతం, కులం, లింగం లేదా ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టులను అరికట్టడానికి ఉద్దేశించిన చట్టమే హేట్ స్పీచ్

➤ మిగతా 2వ పేజిలో..

# కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్

- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ



హైదరాబాద్, మార్చి 30 (అక్షరం న్యూస్) సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

- వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి
- గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ



హైదరాబాద్, మార్చి 30 (అక్షరం న్యూస్) జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ

➤ మిగతా 2వ పేజిలో..

# ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

➢ మొదటి పేజీ తరువాయి

మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు. 'ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉన్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు. ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకేమీ మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హర్మూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తల పైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్ఎస్ ట్రిపోలిపై ఎఫ్-31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎస్ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.

# కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్

➢ మొదటి పేజీ తరువాయి

పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు. దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు..

తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

➢ మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో

కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.

## లాకర్ వస్తువులకు బీమా సౌకర్యం కుదరదు

నిబంధనల ప్రకారం.. దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయి. లాకర్ వార్షిక అ÷-దదెకు 100 రెట్లు పరిహారం చెల్లిస్తున్నాయి' అని ఆమె గుర్తుచేశారు. లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీలు చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం అందించడం సాధ్యంకాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని మంత్రి తెలిపారు.

## ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

➢ మొదటి పేజీ తరువాయి

అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్‌వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని

మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

## అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

➢ మొదటి పేజీ తరువాయి

బిల్లు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినమైన జరిమానాలు, 7 ఏళ్ల వరకు జైలు శిక్షలు విధించడం, ఈ నేరాలను నాన్-బెయిలబుల్‌గా పరిగణించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. విద్వేష పూరిత ప్రసంగాలు మొదటి సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. శిక్షతోపాటు రూ. 50 వేలు జరిమానా విధిస్తారు. ఇదే ఘటన మరోసారి పునరావృతమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారు.

ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. మతం, జాతి, కులం, వర్గం, స్త్రీ, పురుష, లైంగిక, జన్మస్థలం, నివాసం, భాష, అశక్తత, తెగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, ప్రసంగాలు ఉండొద్దని ఈ బిల్లును తీసుకొచ్చింది. మాటల ముద్రణ, ప్రచురణ, ఎలక్ట్రానిక్ మాధ్యమం/సాధనాల ద్వారా సమాచార మార్పిడి ఉన్నా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా ఎలాంటి అసభ్యకర కంటెంట్, సందేశం, సమాచారం ఉంటే వాటిని తొలగించాలని ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సర్వీస్ ప్రొవైడర్లను హెచ్చరించే అధికారం అధికారులకు ఉంటుంది. ఇక మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా?, రెచ్చగొట్టే పోస్టులు చేసినా జైలు శిక్ష తప్పదు! అయితే హేట్ స్పీచ్ బిల్లు అత్యంత ప్రమాదకరమని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రాజకీయ కక్షసాధింపులకే హేట్ స్పీచ్ బిల్లు అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ ప్రివెన్షన్ బిల్లును సెలక్ట్ కమిటీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఆధారాలు లేకున్నా అరెస్ట్ చేసేలా బిల్లు ఉందని, చట్టాలు ప్రజల రక్షణ కోసం ఉండాలి.. ప్రజల గొంతు నొక్కడానికి కాదని విమర్శించారు. ఇలాంటి చట్టం చేసేముందు హౌస్ కమిటీ వేయాలని.. చర్చ సాగాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 4 అనేది ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అని.. హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలియజేశారు.

## చర్చల ద్వారా సమస్యల పరిష్కారం

రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం' అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. 'నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డిఎ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. 'రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

## కాళేశ్వరంతో లక్షకోట్లు ప్రజాధనం వృధా

న్యూఢిల్లీ,మార్చి30 కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ సోమవారం రాజ్యసభలో సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ. లక్షల కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలంటూ రాజ్యసభలో కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ పైవిధంగా స్పందించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటుపై ఎన్డీఎస్ఏ నివేదికను ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# ఆదాయం గోరంత.. ఖర్చు కొండంత..

- రూ.140 కోట్లతో అంచనాలు.. అంకెల గారడీ బడ్జెట్
- నగర వాసులకు ప్రయోజనం శూన్యం...
- 60 డివిజన్లకు 96మంది స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ఎందుకు..?
- పారిశుధ్య కార్మికుల వేతనాల్లో వ్యత్యాసం దేనికి..!?
- బడ్జెట్ ప్రవేశ పెట్టిన తీరు నిబంధనలకు విరుద్ధం..
- కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/30 మార్చ్ / అక్షరం న్యూస్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ రూ.140 కోట్ల అంచనాతో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమని, నగర వాసులకు ఒరిగేదేమీ లేదని మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి తీవ్రంగా విమర్శించారు. సోమవారం మేయర్ గణేష్ అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయంలో తొలిసారి నిర్వహించిన బడ్జెట్ సమావేశంపై ఆమె ధ్వజమెత్తారు. కాగితాలకే పరిమితమైన ఈ బడ్జెట్ కార్యరూపం దాల్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగర అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 107 కోట్ల నిధులు వస్తాయని అంచనా వేస్తూ, 140 కోట్లతో బడ్జెట్ రూపొందించడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య అని విమర్శించారు. ఈ నిధులు ఎలా సమకూరుతాయో స్పష్టత లేకపోవడం బడ్జెట్‌లో పెద్ద లోపమని పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో ఆదాయం కేవలం రూ.33కోట్లు ఉందని, ఆదాయం పెంచే విధంగా ప్రణాళిక లేకుండా ప్రభుత్వ నిధులపై అంచనాలతో గారడి చేయడం సరికాదని, మున్సిపల్ ఆదాయ వనరుల్లో కీలకమైన ఆస్తిపన్ను బకాయిలను కనీసం 70 శాతం వసూలు చేసి ఖజానాలో జమ చేస్తేనే గ్రాంట్లు అందే అవకాశం ఉందని గుర్తు చేశారు. అయితే ఈ అంశంలో నిర్లక్ష్యం కారణంగా నగరానికి రావాల్సిన నిధులు కూడా అందకపోతున్నాయని అన్నారు. అలాగే ఎన్నికల్లో కార్పొరేటర్లు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానికి సరైన నిధుల కేటాయింపులు లేవని, కోతులు, కుక్కల సమస్యల పరిష్కారానికి సరైన ప్రణాళిక లేదని, కనీసం ఈ ప్రధాన సమస్యపై సమావేశంలో అంశాన్ని కూడా చేర్చలేదని విమర్శించారు. అలాగే సమావేశంలో ప్రవేశపెట్టిన 16, 17, 18, 19 అంశాలు ఎవరికి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు.

### బడ్జెట్ ప్రవేశ పెట్టిన తీరు నిబంధనలకు విరుద్ధం..

మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం వరుసగా మూడు వర్కింగ్ రోజుల్లో మాత్రమే బడ్జెట్ సమావేశం నిర్వహించాలని, కానీ ఒక రోజు ఆదివారం కాగా, సోమవారం వర్కింగ్ డే, మంగళవారం మహవీర్ జయంతి సందర్భంగా ఆప్షనల్ హాలిడే ఉండగా, సమావేశం ఎలా నిర్వహిస్తారని, ఇది ఖచ్చితంగా నిబంధనలకు విరుద్ధమన్నారు. హడావుడిగా బడ్జెట్ సమావేశం పెట్టడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

### పారిశుధ్య కార్మికుల వేతనాల్లో వ్యత్యాసం దేనికి..?

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ కలిపి 341 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని, వారిలో పాల్వంచలో పనిచేస్తున్న 137 మందిలో 133మందికి 20,460 ఇస్తుండగా, కొత్తగూడెంలో 175మంది, సుజాతనగర్‌లో 29మంది పనిచేస్తుండగా, వారికి మాత్రం 19,298 వేతనాలు ఇవ్వడం దేనికి అని ప్రశ్నించారు. వారు అందరూ చేస్తున్న పని ఒక్కటే అయినప్పుడు పాల్వంచ వారికి ఎక్కువ, మిగతా ప్రాంతాల వారికి తక్కువగా ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏమిటో వివరించాలని ప్రశ్నించారు. అదే విధంగా 60 డివిజన్లు ఉన్న కార్పొరేషన్‌లో 96 మంది స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ఎందుకని, అదనపు సిబ్బంది పేరిట నిధుల దుర్వినియోగం చేస్తూ ఎవరి ఖాతాలో వేస్తున్నారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా కార్యాలయ ఖర్చులు, ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర వ్యయాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ బడ్జెట్‌లో "సమాన పనికి సమాన వేతనం" అమలు చేస్తే, పాలక ప్రభుత్వాల నుంచి సరైన మద్దతు లేకపోతే ఆర్థిక భారాన్ని తట్టుకోవడం కష్టమని పేర్కొన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ నగర వాసుల ఆశలను నెరవేర్చే విధంగా లేకపోవడం బాధాకరమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా నిధుల వినియోగం జరగాలని కాపు సీతాలక్ష్మి డిమాండ్ చేశారు.

## రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ



జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

వచ్చే నెలలో రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్ ) కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో బూత్ లెవెల్ అధికారులకు సోమవారం కాకతీయ కళ్యాణ మండపంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు . అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , జిల్లా ఎలక్టోరల్ అధికారి జె. అరుణ శ్రీ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో రామగుండం , అంతర్గాశీ , పాలకుర్తి మండలాల తహాశీల్దార్ లు లక్ష్మీ , రవీందర్ పటేల్ , సునీత , సి డి పి ఓ అలేఖ్య పటేల్ నాయబ్ తహాశీల్దార్ అనిల్ , బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.



## నేడు రఘునాథపల్లి అంగడి వేలం





జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)మార్చి 30:

రఘునాథపల్లి మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే అంగడికి గతంలో మూడు సార్లు జరిగిన వేలంలో టెండర్ దారులు ఎవరు ప్రభుత్వ నిర్దేశిత ధరకు దారిదాపులోకి రాకపోవడంతో మూడు సార్లు వాయిదా పడిన విషయం విదితమే.. అంగడి వేలం మూడు సార్లు వాయిదా పడడంతో మొదట జారీ చేసిన రూ.1.50 లక్షల డిడితో కొత్తగా 16 మంది దరఖాస్తు చేసుకున్నారు. పాత టెండరుదారులు 20 మందితో పాటు కొత్త టెండర్ దారులు 16 మందితో కలిసి మొత్తం అంగడి వేలంలో పాల్గొనడానికి 36 మంది టెండర్దారులయ్యారు. 36 మంది టెం డర్దారులతో ఈ నెల 31(మంగళవారం) ఉదయం 10:30 గంటలకు గ్రామ పంచాయతీ కమ్యూనిటీ హాల్లో అంగడి వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బాలకిషన్ గౌడ్ తెలిపారు. టెండర్దారులు సకాలంలో హాజరై గ్రామ పంచాయతీకి సహకరించాలని ఆయన కోరారు.

## ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



జనగామ జిల్లా/రఘునాథపల్లి,/( అక్షరం న్యూస్ ) మార్చి 30:

ఏప్రిల్ ఒకటవ తేది నుండి పదవ తేది వరకు జరిగే ఇంటింటికి సిపిఐ కార్యక్రమా న్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్. రాజారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జెనిగల అంజయ్య అధ్యక్షత వహించగా, సిహెచ్. రాజారెడ్డి హాజరై మాట్లాడుతూ తెలంగాణలో ఇంటింటికి సిపిఐలో భాగంగా మీ సాయం కోరుతూ వస్తున్న కార్యకర లకు విరాళాలు అందించి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, మండల కార్యదర్శి కావటి యాదగిరి, కందుకూరి మల్లేశం, మడికంటి సోమన్న, దామెర అబ్బయ్య, ముప్పిడి. ఎల్లయ్య, మరళి, లక్ష్మీనర్సింహా, పండుగ మల్లేష్, తూడి శ్రీనివాస్, రేణుబాబు, పసుల డానియేల్, నాగేష్, సాదం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ రామగుండంలో సదరన్ రీజియన్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

జ్యోతి నగర్, మార్చి 30 (అక్షరం న్యూస్):

పెద్దపల్లి జిల్లా జ్యోతి నగర్‌లోని ఎన్టీపీసీ రామగుండం మహాత్మా గాంధీ స్టేడియంలో సోమవారం సాయంత్రం సదరన్ రీజియన్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ క్రీడా పోటీలను రామగుండం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ప్రారంభించారు.ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ స్టేడియం నుంచి స్పందన రిక్రియేషన్ క్లబ్ వరకు క్రీడాజ్యోతిని



తీసుకెళ్లి అధికారికంగా పోటీలకు శ్రీకారం చుట్టారు. అనంతరం బెలూన్లు ఎగరవేసి వేడుకను ఆకట్టుకునేలా నిర్వహించారు.ఈ క్రీడా పోటీలలో సదరన్ రీజియన్‌కు చెందిన సింహాద్రి, కూడిగి, హెడ్‌క్వార్టర్స్, రామగుండం, వెల్లూరు జట్లు పాల్గొంటున్నాయి. ఆయా పవర్ స్టేషన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ జట్ల జెర్సీలు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంతతో పాటు జనరల్ మేనేజర్లు ముకుల్ రాయ్, మనీష్ అగర్వాల్ పాల్గొన్నారు. గుర్తింపు యూనియన్ బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి సాగర్ రాజు, ఐఎన్టీయూసీ నాయకుడు వేముల కృష్ణయ్య, ఏఎస్ గౌడ్, అధికారుల సంఘం అధ్యక్షుడు మహేందర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రీడా వేడుకలను ప్రారంభించారు.చాలా సంవత్సరాల తర్వాత సదరన్ రీజియన్ స్పోర్ట్స్ మీట్ రామగుండంలో నిర్వహించడంతో సందడిగా మారింది.





ఎన్టీపీసీ ప్రాంగణం క్రీడాకారులు, ఉద్యోగులతో









### జ్యోతి నగర్‌లో మంచినీటి ట్యాంక్

# ఎక్కి తెలంగాణ ఉద్యమకారుల నిరసన



జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కొందరు మంచినీటి ట్యాంకులు నిరసన తెలిపాడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ ఉద్యమకారుల వేదికకు చెందిన నాయకులు తోడేటి శంకర్ గౌడ్, పొన్నం విజయకుమార్ గౌడ్, వొళ్ళల మల్లేశం ముగ్గురు ఎన్టీపీసీ శాలపల్లి రోడ్డు ఎస్బీఐ బ్యాంకు సమీపంలోని మున్సిపల్ మంచినీటి ట్యాంక్‌పైకి ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, ప్రతి నెల పెన్షన్, కుటుంబానికి ఒక ఉద్యోగం వంటి అనేక హామీలు ప్రభుత్వం ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు వాటిని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే ట్యాంక్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.సమాచారం అందుకున్న వెంటనే ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై ఉదయ్ కిరణ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ట్యాంక్‌పై ఉన్న ఉద్యమకారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వారి డిమాండ్లను తెలుసుకున్నారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినా వారు కొంతసేపు దిగేందుకు నిరాకరించారు.చివరకు పోలీసుల జోక్యంతో ముగ్గురు ఉద్యమకారులను సురక్షితంగా ట్యాంక్‌పై నుంచి కిందకు దింపి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ సోమవారం 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అయితే తమ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని నిర్బంధించారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.







# రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమం

- **రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్**

రామగిరి (పెద్దపెల్లి జిల్లా) మార్చ్ 30 అక్షరం న్యూస్ :

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అరైవ్ అలైవ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కల్వచర్ల గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తాడవేని శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక కుటుంబాలు ఇబ్బందుల పాలయ్యాయని అలాంటి పరిస్థితులు రావొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం కారణంగా అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, సీట్‌బెల్ట్ వాడకపోవడం, అతివేగం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. మైనర్ పిల్లలకు బైకులు ఇవ్వకూడదని ఒకవేళ మైనర్ పిల్లలు బైక్ నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోలలో పరిమితికి మించి వెళ్లకూడాదన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అన్నారు.



# జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం





చిగురుమామిడి మార్చి 30(అక్షరం న్యూస్)

చిగురుమామిడి మండలంలో లోని ఓగులాపూర్ గ్రామం లో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ తగరపు శ్రీనివాస్, మరియు మండల అధ్యక్షులు గుండా సాయి చందు, మండల ఇంచార్జ్ చిట్యాల సూరజ్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తగరపు శ్రీనివాస్ మాట్లాడుతూ... హుస్నాబాద్ నియోజక వర్గంలో మొదట జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది అని అన్నారు. అనంతరం నూతన కమిటీని జనసేన పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా ఎంద్ర శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా తాటి పెల్లి కుమార్, కార్యదర్శిగా శంకర్ చిన్న శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బద్దం మధుసూదన్ రెడ్డి, ప్రచార కార్యదర్శి శంకరి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా జనగాం భరత్, మీడియా కన్వీనర్ గా ఓదెల మహేష్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జన సేన పార్టీ కార్యవర్గ సభ్యులు, బండి సంపత్, లోకేష్, సతీష్, కోటి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అటెండర్‌గా ప్రారంభించి ఎంపీఓగా పదవి విరమణ

- కృషితో ఎదిగిన సేవా గాథకు ముగింపు
- గ్రామం నుంచి పరిపాలనలో ఉన్నత స్థాయికి చేరిన వ్యక్తి
- పదవి విరమణ సందర్భంగా జీవిత ప్రయాణం -- సేవా గాథ
- చిగురుమామిడిలో నేడు ఇంచార్జ్ ఎంపీఓ







**ఖాజా మోయినుద్దీన్ పదవీ విరమణ**

చిగురుమామిడి/మార్చి 30(అక్షరం న్యూస్)

చిగురుమామిడి మండల ఇన్‌చార్జి ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ ఖాజామోయినుద్దీన్ నేడు పదవీ విరమణ చేయనున్నారు. వృత్తినే దైవంగా భావించి క్రమశిక్షణ, నిబద్ధతతో సేవలందించిన ఆయన ఉద్యోగ జీవితం ఆదర్శప్రాయంగా నిలిచింది. 1965 మార్చి 6న మహమ్మద్ ఉస్మాన్, వలియా బీదంపతులకు ఏకైక కుమారుడు ఖాజామోయినుద్దీన్ ,ఖాజా మైనోద్దీన్ స్వగ్రామం నమలికొండపల్లి. యాస్‌వాడలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, కరీంనగర్‌లోని దన్ గడ్ వాడిలో పదో తరగతి పూర్తి చేశారు. అనంతరం ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసించారు. విద్యతో పాటు కృషి, క్రమశిక్షణ వంటి విలువలను అలవర్చుకున్నారు. 1985 మార్చి 27న కరీంనగర్ రాంనగర్ ప్రాథమిక పాఠశాలలో అటెండర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆయన, తన ప్రతిభతో అంచెలంచెలుగా ఎదిగారు. 1990 అక్టోబర్ 31న టైపిస్టుగా, 2002 ఆగస్టు 20న మంథని ముత్తారంలో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు పొందారు. 2014 జనవరి 28న సూపరింటెండెంట్‌గా హౌసింగ్ కార్పొరేషన్‌లో బాధ్యతలు చేపట్టి, 2016 డిసెంబర్ 1న చిగురుమామిడిలో సూపరింటెండెంట్‌గా సేవలందించారు. తన ఉద్యోగ జీవితంలో మూడు సార్లు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన ఆయన, మండల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. సహచరులకు మార్గదర్శకుడి గా, ప్రజలకు సేవకుడిగా నిలిచారు. సమస్యల పరిష్కారంలో చాకచక్యంతో పాటు అందుబాటులో ఉండటం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. పదవీ విరమణ సందర్భంగా సహచరులు, ప్రజాప్రతినిధులు ఆయన సేవలను కొనియాడుతున్నారు. కష్టపడితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చనే సందేశాన్ని ఆయన జీవితం అందిస్తోందని పేర్కొంటున్నారు. మహమ్మద్ ఖాజా మోయినుద్దీన్ సతీమణి నూర్జహాన్, ఈ దంపతులకు ఒక కుమారుడు సాజిద్ అక్తర్,ఇద్దరు కూతుర్లు సాయెఖా అంజుం,సుమేరా తంసీన్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాబోయే కాలంలో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

# రఘునాథపల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో...

- **పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం**






జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )మార్చి 30

అసెంబ్లీలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనుచిత వ్యాఖ్యలతోఅవమానపర్చే విధంగా వ్యవహరించిన పాడి కౌశిక్ రెడ్డి శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్డుపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం రాస్తా రోకో నిర్వహించారు. అనంతరం పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు మాట్లాడుతూ దళితుల పట్ల దొరల అహంకారాన్ని శాసన సభ సాక్షిగా విషం చిమ్మిన పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, జిల్లా నాయకులు మాసాన్పల్లి లింగాజీ, గాదె మహేందర్ రెడ్డి, నామాల బుచ్చయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి, ఇబ్రహీం పాష, కావటి భాస్కర్, లోనే రవిందర్, పర్మ సిద్దేశ్, రంగోజు ఈశ్వరయ్య, బాషమియా. బాల్రెడ్డి, సర్పంచ్ లు బొమ్మ వీరస్వామి, అ బ్రహాం, డ్యాగల రాజశేఖర్, ఈర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు

## ఎరువులు ఎక్కువ ధరకు అమ్ముతున్నారని కలెక్టర్ కు పిర్యాదు చేసిన గంగారం మండల వాసులు






మహబూబాబాద్ జిల్లా/ గంగారం/ మార్చి 30(అక్షరం న్యూస్ )ఐ

సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో అదేవిధంగా మండల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా లిజిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్‌లి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి యొక్క వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. గంగారం మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన గ్రామస్తులు స్తానికంగా ఉన్న ఫర్టీలైజర్ దుకాణ యజమానులు ఎరువులను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని, అదేవిధంగా తమ గ్రామానికి కేటాయించిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని వేరే గ్రామానికి తరలించారని తమపై అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్నారని, మొక్క జొన్న తక్కువ ధరకు కొనుగోలు చేసి చెల్లిస్తున్నారని అట్టి ఫర్టీలైజర్ యజమానులపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి లో వచ్చిన (168) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గుంజేడు ముసలమ్మ ఆలయ హుండీ లెక్కింపు: రూ. 4.03 లక్షల ఆదాయం




మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ మార్చి30(అక్షరం న్యూస్ )

మహబూబాబాద్ జిల్లాకొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ దేవాలయంలో సోమవారం హుండీ లెక్కింపును నిర్వహించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జూ) ఎన్. సత్యనారాయణ పర్యవేక్షణలో, మహబూబాబాద్‌కు చెందిన లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యుల సహకారంతో ఈ లెక్కింపు కార్యక్రమం జరిగింది. రూ. 4,03,597 నగదు వచ్చినట్లు ఈఓ అనిల్ తెలిపారు గత ఏడాది నవంబర్ 18, 2025 నుండి మార్చి 30, 2026 వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో నేపాల్‌కు చెందిన (2007, 2009 నాటి) మూడు నాణేలు, ఒక అరబ్ దేశకు చెందిన నాణెం. రెండు పురాతన నాణేలు లభ్యమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముసలమ్మా ఆలయ కమిటీ చైర్మన్ బుర్కా నరేందర్, పూజారి వెంకటేశ్వర్లు, అటెండర్ వెంకన్న, ఆలయ సిబ్బంది మరియు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## మక్కలను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలి లిబిఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి నెహ్రూ నాయక్



మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ మార్చి 30(అక్షరం న్యూస్ )

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో రైతులు పండించిన మక్కలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని బిఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి నెహ్రూ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై ఆరబోసిన మక్కల కుప్పలను స్వయంగా పరిశీలించారు ఈ సందర్భంగా నెహ్రూ నాయక్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేదని, ఏ క్షణమైనా వర్షం పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అకాల వర్షం కురిస్తే రోడ్లపై ఉన్న మక్కలు తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు..ప్రభుత్వం జాప్యం చేయకుండా వెంటనే మండలంలో మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారురైతులఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు రోడ్ల పక్కన వేచి చూడాల్సి రావడం బాధాకరమని, ప్రభుత్వం స్పందించి మద్దతు ధరతో త్వరగా కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## దొంగతనాలను నిరోధించే అలారం తాళం ఏర్పాటు చేసుకోవాలి

- ఎస్ ఐ గణేష్



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మార్చి -30(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండల పరిధిలో ని గ్రామాలలో మీ ఇంట్లో, గ్రామం లో ఉన్న ఆలయాల్లో దొంగలు పడకుండా నిరోధించేందుకు యాంటీ థెఫ్ట్ అలారం తాళాలు వేయాలని ముస్తాబాద్ ఎస్ ఐ గణేష్ సూచించారు. సోమవారం ముస్తాబాద్ మండలం తెర్లు మద్ది గ్రామం లో గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ -నవీన్ గ్రామం లో ఉన్న 8 ఇతర, కుల. సంఘాల దేవాలయాలకు సర్పంచ్ స్వంత నిధుల తో ఒక్కొకటి రూ. 800రూపాయల విలువ గల స్మార్ట్ యాంటీ థెఫ్ట్ అలారం తాళాల ఏర్పాటు చేయడం తో వాటిని ఎస్ ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ గ్రామాలలో ఇంటి తలుపులు,ఆలయలకు, కిటికీలకు స్మార్ట్ యాంటీ థెఫ్ట్ అలారం తాళం వేస్తే చాలు దొంగలు వాటిని తెరిచేందుకు యత్నిస్తే మాగ్నటిక్ సెన్సార్ల సహాయంతో అలారం మోగుతుందని, దొంగలు ఈ తాళాన్ని పగుల గొట్టేందుకు యత్నిస్తే 105 నుంచి 110 డెసిబుల్ శబ్దాలతో అలారం మోగిస్తూ నివాసితులతోపాటు చుట్టుపక్కల గృహాల వారిని అప్రమత్తం చేస్తుంది.అని తెలిపారు ఈ అధునాతన తాళాల సహాయంతో దొంగతనాలను నియంత్రించవచ్చని తెలిపారు.ఆస్తి నేరాలు జరగకుండా అందరూ అలారం తాళం ఏర్పాటు జూచేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ ఐ తో పాటు గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీరు అసభ్యకరం

- చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరీ మహేష్



చొప్పదండి /కరీంనగర్, మార్చి 30 (అక్షరం న్యూస్ )

శాసనసభ వేదికగా సీనియర్ దళిత నాయకుడు, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు అసభ్యకరమని చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరీ మహేష్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితుల పట్ల కౌశిక్ రెడ్డి ప్రదర్శిస్తున్న వివక్ష రాజకీయాలు మంచి పద్ధతి కాదని మహేష్ పేర్కొన్నారు.కడియం శ్రీహరి సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో కీలక పదవులు చేపట్టిన వ్యక్తి అని, అలాంటి వ్యక్తి పట్ల అసెంబ్లీ సాక్షిగా కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు అసభ్యకరంగా ఉందన్నారు. దళితులపై దుర్భాషలాడడం ఆయనకు ఇదేమి కొత్త కాదు , గతం లోనూ అనేకసార్లు ఇలాగే అహంకారపూరితంగా వ్యవహరించారని విమర్శించారు. కడియం శ్రీహరి పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని , కౌశిక్ రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని మహేష్ డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పని పక్షంలో కౌశిక్ రెడ్డి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## పారదర్శకంగా ఇసుక సరఫరా కోసం మొబైల్ యాప్...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి.
- మన ఇసుక వాహనం మొబైల్ యాప్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్..



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ మార్చి 30/ అక్షరం న్యూస్ -:

పారదర్శకంగా ఇసుక సరఫరా కోసం మన ఇసుక వాహనం మొబైల్ యాప్ రూపకల్పన చేశామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, మన ఇసుక వాహనం మొబైల్ యాప్ ను అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి మన ఇసుక వాహనం మొబైల్ యాప్ అమలులోకి వస్తుందని అన్నారు. గతంలో ఫిజికల్ కూపన్ ద్వారా ఇసుక తరలింపు జరిగేదని, దీనివల్ల కొన్ని అవకతవకలు జరిగే ఆస్కారం ఉండేదని, అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు ప్రభుత్వం మన ఇసుక వాహనం మొబైల్ యాప్ ప్రవేశ పెట్టిందని, దీని ద్వారా ప్రతి అంశం ఆన్ లైన్ ద్వారానే ఉంటుందని అన్నారు. ఇసుక ఎవరికి అవసరం ఉన్న యాప్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని, సమర్పించిన దరఖాస్తు మేరకు ప్రత్యేకమైన క్యూ ఆర్ కోడ్ వస్తుందని, దాని ప్రకారం సంబంధిత లబ్ధిదారులకు డెలివరీ చేసే విధంగా యాప్ తయారు చేశామని అన్నారు

జిల్లాలో ఇక నుంచి ఇసుక సరఫరా ఫిజికల్ కూపన్లు జారీ చేయడానికి వీలు లేదని, దీనిపై తహసిల్దార్లకు ప్రత్యేకమైన సర్క్యులర్ జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సామాన్యులు కూడా వినియోగించే విధంగా మన ఇసుక వాహనం మొబైల్ యాప్ తయారు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, భూగర్భ,గనుల సహాయ సంచాలకులు ఆర్. సాయినాథ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

- సర్పంచ్ మదాసు అనిల్



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మార్చి -30(అక్షరం న్యూస్ )

పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని, పేద కుటుంబాలు వైద్యకోసం దరఖాస్తు చేసిన సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని నామపూర్ సర్పంచ్ మాదాసు అనిల్ అన్నారుముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మదాసు అనిల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గన్నే భాను రెడ్డి ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు సుమారు రూ.1,27,000 వేలరూపాయల విలువ గల ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా మారిందన్నారు. సీఎం కేసీఆర్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి, సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుల కు కృతజ్ఞతలు తెలిపారు ..కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గన్నే భాను రెడ్డి , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలుముల రామ్ రెడ్డి,డికొండ దశరథం, గుండవేణి కుమార్ , మెరుగు శివ మరియు కొట్టూరి నవీన్ గూడ విజయ్ రెడ్డి , నారాయణ తదితరులు పాల్గొన్నారు

## పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

- సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మార్చి -30(అక్షరం న్యూస్ )

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తోందని పోతుగల్ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ అన్నారు ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అనమేని రాజు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ ముఖ్య మంత్రి సహాయ నిధి లబ్ధిదారులు అయిన చేపూరి సందీప్ కు రూ 51000 వేలు తౌటి ఎల్లయ్య కు రూ.24000వేలు నాంపల్లి కల్పన కు 24000 వేలు దేశెట్టి వెంకట రాములు కు రూ.22000 వేల రూపాయలు జంగా లక్ష్మీనారాయణ వార్డు సభ్యుడు కు రూ.32500 వేలరూపాయల విలువ గల చెక్కులను ,మొత్తం: (రూ.153500) వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలసి అందచేశారు .ఈ సందర్బంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయనివి అండగా నిలుస్తుందని అన్నారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు.ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం సామాన్యులకు భారంగా మారుతున్న తరుణంలో, ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో ఊరటనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ-శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అన్నమేని రాజు, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ పెద్దిగారి శ్రీనివాస్, ముస్తాబాద్ మాజీ సర్పంచ్ ఓరగంటి తిరుపతి, ఎన్ ఆర్ ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, మామిండ్ల ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కేసుగాని చంద్రమౌళి, ఆది శేఖర్, రాయమల్లు, హరిబాబు, గ్రామ కుల ప్రముఖులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఎంఈవో కు టీఎంఎఫ్ ఆధ్వర్యంలో సన్మానం



చొప్పదండి /కరీంనగర్,మార్చి 30 (అక్షరం న్యూస్ )

చొప్పదండి ఎంఈవో పీ. మోహన్ స్వచ్ఛంద పదవి విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం ను టీఎంఫ్ చొప్పదండి మండల శాఖ చే ఆత్మీయ సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరమ్ చొప్పదండి మండల శాఖ అధ్యక్షులుకాణిగంటి రాజమౌళి, జిల్లా కౌన్సిలర్ ఆనందం, ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు

## అసెంబ్లీలో రేషన్ బియ్యంతో భోజనం చేసిన ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో రేషన్ బియ్యం నాణ్యతపై విశ్వాసాన్ని తెలియజేసే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డు ద్వారా అందజేస్తున్న సన్నబియ్యం నాణ్యతను ప్రజలకు చూపించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ రాష్ట్ర మంత్రులు మరియు ప్రభుత్వ సలహాదారులతో కలిసి అదే రేషన్ బియ్యంతో తయారు చేసిన భోజనం చేశారు. ప్రజలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పారదర్శకతపై ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ చర్య ద్వారా తెలియజేశారు.ప్రజల ఆరోగ్యం, పోషకాహారం సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రేషన్ ద్వారా అందజేస్తున్న బియ్యం నాణ్యతపై ప్రజల్లో నమ్మకం పెంపొందించాలనే సందేశాన్ని ప్రభుత్వం ఇచ్చింది .



## వెల్లి మోడల్ స్కూల్లో మాక్ ఎన్నికలు




జనగామ జిల్లా/రఘునాధపల్లి/( అక్షరం న్యూస్), మార్చి 30: వెల్లి మోడల్ స్కూల్లో సోమవారం జరిగిన పాఠశాల నాయకత్వ మాక్ ఎన్నికలు ఎంతో ఉత్సాహంగా, ప్రజస్వామ్య వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో విద్యార్థుల విశ్వాసాన్ని చూరగొన్న మొగిలి నవ్యశ్రీ ఘన విజయం సాధించి నాయకత్వ బాధ్యతలను అందుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పాలకుర్తి శ్రీధర్ పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ క్రమబద్ధంగా జరిగింది. రిటర్నింగ్ అధికారులుగా జి.జయశ్రీ, ఎం.శ్రీధర్, సహాయ రిటర్నింగ్ అధికారులుగా గాజర్ల రుద్రమ దేవి. కందగట్ల గణేష్. ఓట్ల కౌంటింగ్ అధికారులుగా పి.వినీల, సౌజన్య ప్రియ, రాజు శ్రీను శశికుమారి వ్యవహరించారు.

## కొండగట్టుకు హనుమాన్ దీక్ష స్వాములు పాదయాత్ర..



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మార్చి -30(అక్షరం న్యూస్ )


ముస్తాబాద్ మండలము పోతుగల్,గూడూరు గ్రామాల నుంచి సోమవారం హనుమాన్ దీక్ష స్వాములు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దర్శనం కోసం పాదయాత్రగా బయలుదేరారు.ఈ సందర్భంగా స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాత్రను ప్రారంభించారు. దీక్ష కొనసాగించిన స్వాములచే గ్రామస్తులు ఆశీర్వాదాలు పొందారు.41, 21,11, రోజులపాటు నియమనిష్టలతో, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం కొండగట్టుకు ఇరుముడి తో పాదయాత్రగా వెళ్తున్నామని,మాల విరమణ చేస్తామని హనుమాన్ దీక్ష స్వాములు తెలిపారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణతో భక్తులు ఉత్సాహంగా యాత్రను కొనసాగించారు.



# స్వంత పనులకు మున్సిపల్ సిబ్బందిని

# వినియోగిస్తున్న కమిషనర్‌పై ప్రజావాణిలో ఫిర్యాదు

- ఫిర్యాదు చేసిన బిజెపి నేత తాడూరి శివ కృష్ణ
- మున్సిపల్ అత్యవసర పనుల నిమిత్తం, మున్సిపల్ మీటింగ్ కొరకు
- తప్ప ఎప్పుడు స్వంత అవసరం లకు సిబ్బందిని వినియోగించుకోలేదు
- మున్సిపల్ కమీషనర్ మనోహర్ వివరణ



చొప్పదండి /కరీంనగర్, మార్చి 30 (అక్షరం న్యూస్ )

చొప్పదండి మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సిబ్బందిని స్వంత పనులకు వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ బిజెపి నేత తాడూరి శివకృష్ణ సోమవారం రోజున కలెక్టరెట్ లోని ప్రజావాణిలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.సోమవారం సమర్పించిన వినతిపత్రంలో మున్సిపల్ పరిధిలో ప్రజా పనులకు వినియోగించాల్సిన సిబ్బందిని వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించడం వల్ల పట్టణంలో పారిశుద్ధ్య పనులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బందిని కమిషనర్ వ్యక్తిగత పనుల కోసం తరచుగా పంపుతున్నారని, దాంతో చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు సక్రమంగా జరగడం లేదని తెలిపారు. సిబ్బంది కొరత కారణంగా పట్టణంలోని పలు కాలనీల్లో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.మున్సిపల్ వాహనాలు, ట్రాక్టర్, ఆటోలను కూడా ప్రజా పనుల కంటే ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల పారిశుద్ధ్య నిర్వహణలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు.ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి మున్సిపల్ కమిషనర్‌పై తగు చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ సిబ్బందిని ప్రజా సేవలకు మాత్రమే వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని బిజెపి నేత తాడూరి శివకృష్ణ జిల్లా జాయింట్ కలెక్టర్ అశ్విని తనాజీ ని కోరారు.మున్సిపాలిటీ అవసరాల కోసం అత్యవసర పరిస్థితిల్లో తప్ప ఎప్పుడూ మున్సిపల్ సిబ్బందిని స్వంత పనులకి ఊయోగించుకోలేదు : మున్సిపల్ కమీషనర్ వివరణ మున్సిపాలిటీ అవసరాల కోసం అత్యవసర పరిస్థితిల్లో తప్ప ఎప్పుడూ మున్సిపల్ సిబ్బందిని తన స్వంత పనులకి ఊయోగించుకోలేదని చొప్పదండి మున్సిపల్ కమీషనర్ మనోహర్ వివరణ ఇచ్చారు. మున్సిపాలిటీ అత్యవసరాలలో, మున్సిపాలిటీకి సంబందించిన వివిధ రకాల మీటింగ్ లు చొప్పదండి లోని వివిధ ప్రదేశం లలో, అత్యవసరముగా కరీంనగర్ లో మున్సిపాలిటీకి సంబందించి ఏదయినా మీటింగ్ వున్న సందర్భములలో మాత్రమే సిబ్బందిని వినియోగించుకున్నాము తప్ప తమ స్వంత అవసరాల కోసం మున్సిపల్ సిబ్బందిని ఎప్పుడూ ఊయోగించుకోలేదని, వాడుకోలేదని మున్సిపల్ కమీషనర్ అక్షరం దినపత్రికకు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి.
- స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం..
- ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్..

ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ మార్చి 30/ అక్షరం న్యూస్ -:

యాసంగి (రబీ) 2025-26 ధాన్యం కొనుగోలు పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన యాసంగి (రబీ) 2025-26 సీజన్ ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రస్తుత యాసంగి సీజన్ నుంచి ధాన్యం కొనుగోలు వివరాలతో పాటు రైతులకు జరిగే చెల్లింపులను కూడా రెగ్యులర్ గా మానిటర్ చేయడం జరుగుతుందని, రైతులకు చెల్లింపు జరిగినప్పుడే మన బాధ్యత పూర్తవుతుందని అన్నారు. ఐకేపి ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులకు చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని, దీనిని ఇంప్రూవ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యం వెంటనే కొనుగోలు చేసి సంబంధిత రైస్ మిల్లులకు వెంటనే తరలించి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. ఐకేపి నిర్వాహకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ప్రత్యేకంగా రివ్యూ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గన్ని బ్యాగులు మిల్లర్ల నుంచి పూర్తి స్థాయిలో సేకరించాలని కలెక్టర్ అన్నారు. ధాన్యం రవాణా వాహనాలు సరిగ్గా ఉండేలా చూడాలని, ప్రతి వాహనానికి జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టం కాకుండా కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లను అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన తేమ యంత్రాలు, ఇతర ఇన్ ఫ్రా అందుబాటులో ఉందో లేదో క్రాస్ చెక్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైస్ మిల్లర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేరా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటు లో పెట్టాలని అన్నారు. గత అనుభవాలు దృష్టిలో ఉంచుకుని ఇబ్బంది కరమైన కేంద్రాలలో ఎటువంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాబోయే వారం రోజులలో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన టార్పాలిన్ ఎత్తు ప్రాంతంలో పెట్టాలని అన్నారు. వేసవి ఉష్ణోగ్రత పెరుగుతున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు నీడ ఉండే విధంగా టెంట్ ఏర్పాటు చేయాలని, రైతులు ఎవరికీ వడదెబ్బ తగలకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి కోనుగోలు కేంద్రం వద్ద నోటీస్ బోర్డు ఏర్పాటు చేసి అందుబాటులో ఉన్న గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు టోకెన్ జారీ చేయాలని, గన్ని బ్యాగుల వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిసిఓ గంగాధర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీం, మండల ప్రత్యేక అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి..

- వైరా ఏసిపి సారంగపాణి
- రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రాణనష్టాన్నినివారించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన...
- "అరైవ్ అలైవ్" ప్రత్యేక కార్యక్రమం...ద్వారా"సురక్షితంగా గమ్యం చేరడం" "ప్రాణాలతో ఉండటం" అనే లక్ష్యంతో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు..
- హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతపై అవగాహన..
- వైరా ఏసిపి సారంగపాణి



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ మార్చి 30/ అక్షరం న్యూస్ -:

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వైరా ఏసిపి సారంగపాణి కోరారు.

ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రం లోని వైరా పోలీస్ స్టేషన్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఎసిపి సారంగపాణి మాట్లాడుతూ రోడ్డు భద్రతలో ప్రజల సహకారం కీలకమని అన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రాణనష్టాన్ని నివారించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్" ప్రత్యేక కార్యక్రమం ద్వారా"సురక్షితంగా గమ్యం చేరడం" "ప్రాణాలతో ఉండటం" అనే లక్ష్యంతో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు . ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. అదేవిదంగా మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ప్రయాణం చేసేటప్పుడు వాహనదారులు తీసుకునే జాగ్రత్తలు సురక్షితమైన గమ్యానికి రక్ష అని అన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకట ప్రసాద్ , ఎస్సై రామారావు పవన్ స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు కౌన్సిలర్లు డ్రైవర్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.








## రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరి..

- వైరా ఏసీపీ.




ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ మార్చి 30/ అక్షరం న్యూస్ -:

ప్రజల సహకారం రోడ్డు భద్రతలో కీలకమని వైరా ఏసీపీసారంగపాణి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రాణనష్టాన్ని నివారించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్" ప్రత్యేక కార్యక్రమం ద్వారా"సురక్షితంగా గమ్యం చేరడం" "ప్రాణాలతో ఉండటం" అనే లక్ష్యంతో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతపై బోనకల్ పోలీస్ స్టేషన్ లో సర్పంచులు, వైస్ సర్పంచులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. అదేవిదంగా మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ప్రయాణం చేసేటప్పుడు వాహనదారులు తీసుకునే జాగ్రత్తలు సురక్షితమైన గమ్యానికి రక్ష అని అన్నారు. కార్యక్రమంలో మధిర రూరల్ సిఐ మధు, ఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ద్వారా 6,572 కేసులు పరిస్కారం..

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ మార్చి 30/ అక్షరం న్యూస్ -:

జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని, వీటి ద్వారా 6,572 కేసులు పరిష్కారమయ్యాయని, 77 సైబర్ క్రైమ్ కేసుల్లో 36 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేశారని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన 6,572 కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు -764, ఈ పెట్టి కేసులు -1,837, డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు - 3,971, సైబర్ కేసులు -77 పరిష్కరించడం ద్వారా 36,47,338/- రూపాయలు బాధితులకు అందజేశారని తెలిపారు. రాజీ మార్గం రాజ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బంది పోలీస్ కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగం సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నల్ల వజ్రం అవార్డు అందుకున్న డాక్టర్ జి రమేష్ బాబు




జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ప్రజలకు దీర్ఘకాలంగా వైద్య సేవలు అందిస్తున్న హోమియో వైద్యుడు డా. జి. రమేష్ బాబు నల్ల వజ్రం అవార్డును అందుకున్నారు. తార ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన నల్ల వజ్రం అవార్డు కార్యక్రమం శనివారం గోదావరిఖని ఆర్కే గార్డెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు గంటాడి కృష్ణతో పాటు పలువురు ప్రముఖులు డా. జి. రమేష్ బాబును సత్కరించి అవార్డును అందజేశారు.డా. జి. రమేష్ బాబు కుటుంబానికి వైద్య సేవలు ఒక సంప్రదాయంగా కొనసాగుతున్నాయి. ఆయన తండ్రి డా. జి. ముత్తిలింగం గోదావరిఖనిలో దాదాపు ఐదు దశాబ్దాల పాటు ఆయుర్వేద వైద్యం చేసి ప్రజలకు సేవలందించారు. ఆ మార్గంలోనే కొనసాగుతూ డా. జి. రమేష్ బాబు గత 36 సంవత్సరాలుగా హోమియో వైద్యంతో ప్రజలకు అండగా నిలుస్తున్నారు.సింగరేణి కార్మిక ప్రాంతాలు, రామగుండం, ఎన్‌టిపిసి, ఎఫ్సీఐ, కేశవ్ రామ్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రాంతాలతో పాటు మంచిర్యాల నుంచి కూడా అనేక మంది రోగులు ఆయనను సంప్రదిస్తుంటారు. రోగులతో ఆప్యాయంగా మాట్లాడి ధైర్యం ఇచ్చే వైద్యుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. తనకు అవార్డు ఇవ్వడం పట్ల నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ అవార్డు తనకు బాధ్యత మరింత పెంచిందని రోగులకు మరింత వైద్యం చేయడానికి ఉత్సాహాన్ని ఇస్తున్నదని రమేష్ బాబు అన్నారు.



# సి.ఎం.ఎలో మెరిసిన అఖిల నాగ రమ్య..



- బెంగళూరు వేదికపై సత్తా చాటిన ఖమ్మం అమ్మాయి..
- తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం..

ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్/ మార్చి 30/ అక్షరం న్యూస్ -:

ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థిని అర్వపల్లి అఖిల నాగ రమ్య జాతీయ స్థాయిలో నిర్వహించిన సి.ఎం.ఎ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, బెంగళూరు వేదికపై ప్రశంసలు అందుకుని జిల్లా ఖ్యాతిని చాటింది. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఈ విజయంతో తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించడమే కాకుండా, అనేక మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది.ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంకు చెందిన అర్వపల్లి నగేష్ -- శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె అయిన అఖిల నాగ రమ్య చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచింది. మౌంట్ ఫోర్ట్ స్కూల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివి, పదో తరగతిలో 9.5 జీపీఏతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. అనంతరం సాహితి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లోనూ అగ్రశ్రేణి ఫలితాలు సాధించింది.ఆమె ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా గుంటూరులోని ప్రముఖ 'మాస్టర్ మైండ్' కాలేజీలో







సి.ఎం.ఎ కోర్సులో చేర్పించారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో అఖిల నాగ రమ్య జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించి, బెంగళూరులో జరిగిన గౌరవ కార్యక్రమంలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా అఖిల మాట్లాడుతూ, 'నా విజయానికి ప్రధాన కారణం నా తల్లిదండ్రులే. వారి కష్టం, ప్రోత్సాహమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చాయి. నా విజయం వారికే అంకితం' అని తెలిపింది.అఖిల నాగ రమ్య విజయం పట్ల స్థానికులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆమె చెల్లెలు యువ నాగశ్రీ ప్రస్తుతం గుంటూరులో చార్టెడ్ అకౌంటెన్సీ (సి.ఏ) కోర్సు అభ్యసిస్తుండటం కుటుంబంలో విద్యాపట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. సంకల్పం, కృషి, కుటుంబ సహకారం ఉంటే ఎంతటి ఉన్నత స్థాయికైనా చేరుకోవచ్చని అఖిల విజయం మరోసారి నిరూపించింది.

## ఎస్సీ బాలికల హాస్టల్ ప్రారంభం చేయడానికి సిద్ధం చేయండి..మేయర్ మహంకాళి స్వామి



జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 30పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎస్ సి బాలికల వసతి గృహం నూతన భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఆదేశించారు. ఎన్ టి పి సి సంస్థ సి.ఎస్.ఆర్ నిధులు రూ 2.14 కోట్లతో పాత మునిసిపల్ కార్యాలయం ప్రక్కన కొత్తగా నిర్మించిన భవనాన్ని ఎన్ టి పి సి , మునిసిపల్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం పూర్తయిన నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన మంచాలు , పరుపులు , ఫర్నిచర్ ఇతర సామాగ్రి తోపాటు నీటిని శుద్ధి చేసే యంత్రం కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. త్వరలో ఎంఎల్ఎ చేతులమీదుగా ప్రారంభించి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు విద్యార్థినులకు అందుబాటులోకి తేవాలని అన్నారు. ఈ వసతి గృహం ప్రారంభంతో సుమారు 160 మంది ఎస్ సి విద్యార్థినులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ సంధర్భంగా పలువురు కార్పొరేటర్లు , ఎన్ టి పి సి హెచ్ ఆర్ మేనేజర్లు విజయ్ కుమార్ షిక్దర్ , యుగంధర్ రావు , కార్తీక్ , నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి రామన్ , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## డిమాండ్లు నెరవేర్చకుంటే చీకట్లోకి రాష్ట్రం

- యాజమాన్యానికి ఆర్టిజన్ల హెచ్చరిక
- ఏప్రిల్ 8 నుంచి నిరవధిక సమ్మెకు సన్నద్ధం




పెద్దపల్లి టౌన్ మార్చి 30 అక్షరం న్యూస్

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్లు,ఆన్ మ్యాన్ మరియు మీటర్ రీడర్ల సమస్యల పట్ల విద్యుత్ యాజమాన్యం ప్రదర్శిస్తున్న ఉదాసీన వైఖరిపై కార్మిక లోకం భగ్గుమంటూ, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేశారు. గత మార్చి 26న నిర్వహించిన ఒక రోజు ధర్నాకు యాజమాన్యం నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో, కార్మికులు మరోసారి భారీ నిరసన కార్యక్రమం చేపట్టరు. ఈ సందర్భంగా ఆర్టిజన్ జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి, ఆన్ మ్యాన్ జిల్లా అధ్యక్షులు ఇరుగురాల రమేష్ మాట్లాడుతూ యాజమాన్యం తమ డిమాండ్లను వెంటనే అంగీకరించని యెడల ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా అన్ని సర్కిల్ కార్యాలయాల ముందు వంట-వార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, అప్పటికి కూడా స్పందన లేని పక్షంలో ఏప్రిల్ 8 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్తామని యాజమాన్యానికి అల్టిమేటం జారీ చేశారు. ప్రధానంగా ఆర్టిజన్ల స్టాండింగ్ ఆర్డర్‌ను తక్షణమే రద్దు చేసి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని, ఆన్ మ్యాన్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి వారిని విద్యుత్ సంస్థలో విలీనం చేసుకోవాలని, అలాగే మీటర్ రీడర్లు మరియు మిగిలి ఉన్న పీస్ రేటు కార్మికులకు పూర్తి స్థాయిలో ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో దాదాపు 100 మందికి పైగా ఆర్టిజన్లు,ఆన్ మ్యాన్, స్పాట్ బిల్లర్లు మరియు పీస్ రేటు కార్మికులు పాల్గొని నిరసన వ్యక్తం చేయగా, అన్ని యూనియన్ల నాయకులు ఈ పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. తమ సమస్యలపై ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో సమ్మె ద్వారా విద్యుత్ సేవలు నిలిచిపోతే దానికి యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని నాయకులు తీవ్రంగా హెచ్చరించారు

## సందర్శకుల నుంచి శాలువాలకు బదులు నోట్బుక్స్ స్వీకరిస్తున్న మేయర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 30పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సందర్శకుల నుండి శాలువాలు ,పుష్పగుచ్చాలకు బదులుగా నోట్ బుక్స్ , పెన్నులు స్వీకరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి. తనను మర్యాద పూర్వకంగా కలవడానికి కొందరు శాలువాలు తీసుకురాగా సున్నితంగా తిరస్కరించారు. నోట్ బుక్స్ , పెన్నులు స్వీకరించి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ చైతన్య కళాశాల నిర్వాహకులు , అశోక్ నగర్ వాసి కూచన సాంబయ్య లు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి నోట్ బుక్స్ , పెన్నులు బహుకరించారు. విద్యార్థులకు ఉపకరించే వస్తువులు మాత్రమే స్వీకరిస్తానని మేయర్ తెలిపారు.



## సర్పంచ్ ను సన్మానించిన మాజీ సర్పంచ్



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) మార్చి30 అక్షరం న్యూస్ :

రామగిరి మండలం రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావును సోమవారం పెద్దంపేట మాజీ సర్పంచ్,మాజీ ఎంపీటీసీ బాకం.రాజేశం సన్మానించారు. ఇటీవల ఎన్నికలలో సర్పంచ్ గా ఆమె గెలుపొందారు. స్థానిక ఎన్నికలలో భారీ మెజార్టీతో ఆమెను గెలిపించడం పట్ల ఆయన హర్షశీ వెలబుచ్చారు. ప్రజల మన్ననలు పొందడంతోనే ఒకసారి ఎంపీటీసీగా, రెండుసార్లు సర్పంచ్ గా గెలుపొందడం జరిగిందన్నారు. ఈయన వెంట మందమర్రి డివిజన్ నాయకులు కుమ్మరికుంట. సత్యనారాయణ పాల్గొన్నారు.

## నగర సుందరికరణ లక్ష్యంగా మేయర్ దూకుడు



జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

నగర సుందరీకరణే లక్ష్యంగా మురుగు నీటి కాలువలను శుభ్రం చేయించే పనిలో రామగుండం నగర నగర మేయర్ మహంకాళి స్వామి నిమగ్నమయ్యారు.శనివారం నీటి సరఫరా పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తు పైప్ లైన్ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ పూర్తి చేయించిన మేయర్ అదే తరహాలో మురుగు నీటి కాలువలో పూడిక తొలగింపు పనులను కూడా పర్యవేక్షిస్తున్నారు. సోమవారం తెల్లవారు ఝాముననే కార్యరంగం లోకి దిగారు . నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రదాన రహదారి వెంబడి పారుతున్న పెద్ద మురుగు నీటి కాలువలో జె సి బి యంత్రం సహాయంతో పూడిక తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. క్షేత్ర స్థాయిలో దగ్గరుండి సిబ్బందికి మార్గదర్శనం చేస్తూ కాలువ శుభ్రం చేయించారు. తొలగించిన పూడికను కూడా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ ద్వారా తరలించే ఏర్పాట్లు చేయించారు. ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన పూడికను తొలగించడంలో కాలువ సాఫీగా ప్రవహిస్తున్నది.



## "అరైవ్ -- అలైవ్ -- 2026" ఫేజ్-3లో భాగంగా ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మార్చి 30పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గారి ఉత్తర్వుల మేరకు, "అరైవ్ -- అలైవ్ -- 2026" ఫేజ్-3 కార్యక్రమంలో భాగంగా ఈరోజు సోమవారం నాడు గోదావరిఖని 1 టౌన్ పోలీస్ పరిధిలో నీ ఆటో డ్రైవర్స్ కి గోదావరిఖని 1 టౌన్ ఎస్ఐ మనోహర్ ఆధ్వర్యంలో, దుర్గ ప్రసాద్ నేత్రాలయంలో ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడింది. ఈ శిబిరంలో ఎక్కువ సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొని తమ కంటి పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ, డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు చాలా ముఖ్యమని, కంటి సమస్యలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో డ్రైవర్ల ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆటో?డ్రైవర్స్, ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని పోలీస్ కోరారు.

## డబుల్ బెడ్ రూమ్ గృహాన్ని తిరిగి అప్పగించిన దంపతుల ను ప్రశంసించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన మహిళ



పెద్దపల్లి ప్రతినిధి మార్చి 30 అక్షరం న్యూస్;

పెద్దపల్లి జిల్లాకు చెందిన శ్రీమతి వరహగిరి శైలజ, భర్త వెంకటరావు దంపతులు సోమవారం కలెక్టరేట్ లో ప్రభుత్వంచే మంజూరైన డబుల్ బెడ్ రూమ్ గృహాన్ని స్వచ్ఛందంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు తిరిగి అప్పగించారు.తమ పిల్లలు సాఫ్ట్వేర్ ఉద్యోగం లో స్థిరపడిన నేపథ్యంలో తమకు ఈ గృహం అవసరం లేదని భావించి, వేరే నిరుపేద కుటుంబానికి కేటాయించాలని సోమవారం రోజున పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గృహాన్ని తిరిగి అప్పగించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, అవసరం లేకపోయినా ప్రభుత్వ ఆస్తిని తిరిగి ఇచ్చిన శ్రీమతి శైలజ దంపతులు నిజాయితీకి నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తి సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని ఆయన అభినందించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అవసరమైన వారికి అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్వేషపు సెగల్లో మానవత్వపు వెలుగు

- **దేశ సమగ్రతకు సవాలుగా మత రాజకీయాలు.**

**అక్షరం న్యూస్.ప్రతినిధి. సుల్తానాబాద్,(పెద్దపల్లి జిల్లా),మార్చి 30,**


**(మహమ్మద్ యూసుఫ్ అలీ )**

రాజకీయ పుణ్యమా అంటూ సమాజంలో మనుషుల మధ్య సోదర భావం అడుగంటిపోతోంది. ఒకప్పుడు భారతీయ ఆత్మగా వెలిగిన ఆత్మీయ అనుబంధాల స్థానంలో కుల మతాల విభజన రేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాజకీయ లబ్ధి కోసం, సమాజంలో అస్థిరతను సృష్టించడం ప్రమాదకరమైన విష సంస్కృతికి నాంది. మనుషుల మధ్య గోడలు కట్టి, మనసుల మధ్య దూరం పెంచి పబ్బం గడుపుకుంటున్న శక్తులు దేశ అఖండతకే గొడ్డలిపెట్టుగా మారుతున్నారు. ఈ విద్వేషపు ధోరణి ఇప్పుడు అల్ప సంఖ్యా ప్రజల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తోంది. ఏదో ఒక కారణం తో వీరి పై దాడులు చేయడం,వీరి వ్యాపారాల గురించి తప్పుడు ప్రచారాలు చేయడం.పొట్ట పోసుకునేందుకు వీరు చేసే వ్యాపారాలను బహిష్కరించాలని బహిరంగంగా పిలుపునివ్వడం, లాంటి విషయాలు సమాజం లో పేద అల్ప సంఖ్య ప్రజల్లో ఒక రకమైన అబద్రతా భావన ను పెంచుతుందనేధి కఠోర వాస్తవం. మొన్నటికి మొన్న జరిగిన బన్' వివాదం ఇందుకు నిదర్శనం. ఈ సంఘటన లో ఎక్కువ శాతం జనాలు ఆ పేద బన్' అమ్ముకునే చిరు వ్యాపారికి అండగా నిలువడం , కొందరు నాయకులు కూడ సపోర్ట్ గా రావడం తో విషయం మరో మలుపు తిరిగింది. తెలుగు రాష్ట్రాల్లో చర్చకు దారి తీసిన 'బన్ వివాదం' ఒక ఉదాహరణ మాత్రమే. అల్ప సంఖ్యా ప్రజల వ్యాపారాల కు మతపరమైన రంగు పులిమి వారి ఉపాధిని దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయి. తర తరాలుగా పూలు, పండ్లు అమ్ముకుంటూ, జీవించే చిరు వ్యాపారులను సైతం వదలడం లేదు. ఆకలికి మతం ఉండదని, శ్రమకు కులం ఉండదనే కనీస స్పృహను కూడా కోల్పోయి, వారి పొట్ట కొట్టడం ఏ రకమైన ధర్మమో మేధావులకే తెలియాలి. మనుషుల్ని వ్యక్తిగతంగా విడదీసి లబ్ధి పొందాలనుకునే విధానంతో దేశం బలోపేతం కాదు పైగా వెనక్కి నెట్టి వేయ బడుతుంది. తాము ఏమి చేస్తున్నామో కూడ తెలియని స్థాయి కు కొన్ని సంస్థలు చేరుకున్నాయి. వారు కేవలం అల్ప సంఖ్య ప్రజల వ్యాపారాలను టార్గెట్ చెసుకుని వారిని వేదించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకున్న సంఘటన మానవత్వం ఎంతగా దిగజారిందో చెప్పకనే చెబుతోంది. స్కూల్ యూనిఫాంలు అమ్ముకుంటూ జీవనం సాగించే 70 ఏళ్ల వృద్ధుడి పై కొందరు మత తత్వవాదులు దాడికి తెగబడటం ఒక హేయ మైన చర్య. కేవలం పేరు కారణంగా ఆ వృద్ధుడిని వేధించడం సభ్య సమాజం తలదించుకోవాల్సిన విషయం. అక్కడే ఉన్న జిమ్ ట్రైనర్ దీపక్ అనే యువకుడు ప్రాణాలకు తెగించి ఆ వృద్ధుడిని కాపాడటం, కోసం తనను తాను మహమ్మద్ దీపక్ గా చెప్పుకుంటూ ఆ మూకను ఎదుర్కోవడంతో దేశ వ్యాప్తంగా అభినందనలు అందుకున్నాడు.. ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం దీపక్ ను కలిసి అభినందించారు. మత పిచ్చి ఎంతగా ముదిరిందంటే పాకిస్తాన్ లోని కరాచీ పట్టణం పేరు మీదున్న కరాచీ బేకరీ ముస్లిం లకు సంభంచిన వ్యాపార సంస్థ గా భావించి దాడి చేయడం జరిగింది.వాస్తవానికి కరాచీ బేకరీ హిందువుల వ్యాపార సంస్థ. దేశ విభజన సమయం లో కరాచీ నుంచి ఇండియా కు వచ్చిన హిందువులు తమ జన్మ స్థలం పేరు పై వ్యాపారం చేసుకుంటున్నారు.ఇలా చెపుకుంటూ పోతే ఎన్నో సంఘటనలు, చిన్న చిన్న కారణాలను సాకుగా చూపిస్తూ, దాడులు చేయడం తరచూ వింటూనే ఉన్నాం. కొందరు బాబా లు గా చలామణి అయ్యే వారు సైతం ఇలాంటి ద్వేష వాతావరణానికి ఆజ్యం పోయడం సమాజాన్ని విచ్ఛిన్నం చేసే చర్య గానే భావించాలి. ప్రముఖ రాజకీయ పార్టీ గుర్తింపు పొందాలంటే, రాజకీయ ఎదుగుదల కావాలంటే, ఇలాంటి సంఘటనలను సమర్ధిస్తూ,వాటిలో పాలు పంచుకోవడం తో సరి పోతుందని కొందరు పని కట్టుకుని మరీ అల్ప సంఖ్య ప్రజలను వేదించే దిశగా అడుగులు వేస్తున్నారు. రాజకీయమంటే ఈ చిల్లర వేషాలు వేయడం కాదని హుందాతనంగా ప్రజా సేవ చేయడం తో పాటు , ప్రజల మధ్య ఐక్యతను చాటి చెబుతున్ననాయకులు ఇంకా మన రాజకీయాల్లో ఉన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కామరెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి రమణ రెడ్డి. లాంటి నాయకులు ఎప్పుడు కూడ ఇలాంటి వేదింపులను సమర్ధించలెధు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ప్రజలనుద్దేశించి రాజకీయాల కోసం ప్రజలు, తమ మధ్య బేధాభిప్రాయాలు పెంచుకోవద్దని, అసెంబ్లీ లో ఎమ్మెల్యేలు అందరూ పార్టీలు మర్చిపోయి కలిసి ఉంటామని ప్రజలు కూడ అలాగే ఉండాలని ఓ సారి కోరడం జరిగింది.నిజామాబాద్ లోకసభ సభ్యులు ధర్మపురి అరవింద్ కూడ మేము ముస్లిం లకు వ్యతిరేకం కాదు. మా వ్యతిరేకత కేవలం ఏం.ఐ.ఏం పార్టీ తోనే అని ప్రకటించారు. ఇదొక ఆరోగ్య కర పరిణామం, హుందాతనం. ఐక్యతను ఛాటి చెప్పే గొప్పతనం. కాకపోతే మరెందుకు కింది స్థాయి కార్యకర్తల కంట్రోల్ అవ్వలేక పోతున్నారు అనేదే ప్రశ్న. ఏం.ఐ.ఏం.లాంటి రాజకీయ పార్టీ ను ఆసరాగా తీసుకుని ఆ పార్టీ విధానాన్ని వారి అభిప్రాయాలను వారి మాటలను మొత్తం ముస్లిం సమాజపు అభిప్రాయంగా చిత్రీకరించడం, ఆ పార్టీ నాయకుల రాజకీయ ప్రకటనను ఆధారం చేసుకుని చిన్న చిన్న పనులు చేసుకుని బతికే పేద ప్రజలను వేధించడం అమానవీయ చర్య. ఇదంతా కేవలం వ్యక్తి గత స్వ ప్రయోజనాల కోసమే జరిగే వికృత క్రీడ. ఇక లోకల్ నాయకుల నుంచి ప్రకటనల కోసమో లేక వ్యూస్ కోసమో విద్వేషపు విష సంస్కృతిని ప్రోత్సహించడంలో కొన్ని మీడియా సంస్థలు కూడ ఉండటం విచారకరం. సమాజంలో శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యతను మరిచి, తమ స్వార్థం కోసం ప్రతి చిన్న విషయాన్ని మత కోణంలో చూపిస్తూ డిబేట్' ల పేరు పై గోరంత విషయాన్ని కొండంతగా బూతద్దంలో చూపిస్తూ, అసత్య ప్రచారాలతో సామాజిక అస్థిరతకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములవుతున్నాయి. నిజాలను నిర్భయంగా చెప్పాల్సిన మీడియా, మత విద్వేషాలను రగిల్చే వేదికగా మారడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. అయితే, ఈ రోజుల్లో కూడా నిజాయితీ గా భాద్యత గల పౌరులుగా సామాజిక సమానత్వం కోసం, దేశ హితం కోసం నిలబడే నిజాయితీగల జర్నలిస్టులు, నాయకులు, స్వచ్ఛంద సేవకులు ఉండటం ఆశాజనకం. వారు విద్వేషపు రాజకీయాలను ఎండగడుతూ, ప్రజల మధ్య ఐక్యతను చాటి చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తూ మతపరమైన విభేదాలను తొలగించడానికి కృషి చేస్తున్నారు. అఖండ భారతదేశం అంటే కేవలం మట్టి కాదు, దేశం అంటే మనుషులు. మనుషుల మధ్య ప్రేమ, సోదర భావం లేనప్పుడు కేవలం నినాదాలు దేశాన్ని అఖండంగా ఉంచలేవు. ఒక వైపు అఖండ భారతదేశం కావాలని నినదిస్తూనే, మరోవైపు తోటి పౌరులను శత్రువులుగా చూడటం ద్వంద్వ నీతికి నిదర్శనం. వ్యక్తిగత స్వార్థం కోసం మనుషుల్ని విడదీసి లబ్ధి పొందాలనుకునే ఈ విధానం దేశాన్ని వంద ఏళ్లు వెనక్కి నెట్టివేస్తుంది. మనుషుల మధ్య గోడలు కట్టి ఈ విద్వేషపూరిత రాజకీయాలను అడ్డుకోకపోతే, భవిష్యత్ తరాలకు మనం ఒక విచ్ఛిన్నమైన సమాజాన్ని మాత్రమే అందించగలం.ఇప్పటికైనా మతతత్వ శక్తులను నిరసిస్తూ, మానవతావాదుల స్ఫూర్తితో, నిజాయితీగల నాయకుల మద్దతుతో సమాజాన్ని ఏకం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. మతాల మధ్య గోడలు కట్టి అఖండ భారతాన్ని నిర్మించలేం. మనుషుల మధ్య వంతెనలు కట్టినప్పుడే 'దేశం' వెలుగుతుంది. విద్వేషపు చీకటిని చీల్చడానికి మానవత్వపు వెలుగులే నేటి అవసరం.




మతాల మధ్య గోడలు కట్టి అఖండ భారతాన్ని నిర్మించలేం. మనుషుల మధ్య వంతెనలు కట్టినప్పుడే 'దేశం' వెలుగుతుంది.





# క్యూఆర్' రిఫ్లెక్టివ్ టేపుల నిబంధనను నిలిపివేయాలి

- రాజీవ్ రహదారి పై లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాస్తారోకో
- అనంతరం రవాణా శాఖ అధికారులకు వినతిపత్రం అందజేత



పెద్దపల్లి ప్రతినిధి, మార్చి 30 అక్షరం న్యూస్;

రవాణా వాహనాలకు తప్పనిసరి చేసిన క్యూఆర్' రిఫ్లెక్టివ్ టేపుల నిబంధనను ఉపసంహరించుకోవాలని, అలాగే పెరిగిన ఫిట్నెస్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రాజీవ్ రహదారి పై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షులు బారీ, రామగుండం ఏరియా లైన్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె శ్రీనివాస్ రెడ్డి

మాట్లాడుతూ... రవాణా రంగాన్ని నమ్ముకుని వేల కుటుంబాలు జీవిస్తున్నాయని, ఐతే ఇటీవల ప్రభుత్వం వాహనాలకు క్యూఆర్ కోడ్ కలిగిన రిఫ్లెక్టివ్ టేపులను మరియు రేర్ మార్కింగ్ ప్లేట్లను ఫిబ్రవరి 20 నుండి తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులనుఎదుర్కొంటున్నామన్నారు.ఇప్పటికే డీజిల్ ధరల పెరుగుదల, విడిభాగాల ఖర్చులు, త్రైమాసిక పన్నులు, టోల్ చార్జీలు, పెరిగిన వాహన ఫిట్నెస్ ఛార్జీల భారంతో యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటికీ తోడుగా ఈ కొత్త నిబంధన అదనపు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ విధానం అమలు ప్రక్రియలో లారీ యజమానులకు ఎన్నో సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు తలెత్తి మోయలేని భారం అయ్యాయని తెలిపారు. ఈ రిఫ్లెక్టివ్ టేపుల వల్ల కలిగే ప్రయోజనం కంటే, వాటి సేకరణలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది యజమానులు ఈ నిబంధనల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం ఈక్యూఆర్ టేపుల నిబంధనను తక్షణమే నిలిపివేసి అదనపు భారం పడకుండా చూడాలని కోరారు. రాస్తారోకో చేస్తున్నా లారీ యజమానులతో మాట్లాడి ట్రాఫిక్ సీఐ అనిల్, పెద్దపల్లి ఎస్ఐ మల్లేష్ లు రాస్తారోకోను విరమింప చేశారు. అనంతరం లారీ యజమానులు పెద్దపల్లి ఎంవిఐ స్వప్న,

ఏఎమ్ విఐ వంశీకృష్ణ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలోడిసిఎం అసోసియేషన్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్ అలీ, సెక్రటరీ బాలాజీ, ఖాజోద్దీన్, బసంత్ నగర్ అధ్యక్షులు మేకల సదానందం , ప్రధాన కార్యదర్శి మాదాసు చంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మేకల నరసయ్య, గోదావరిఖని అసోసియేషన్ అధ్యక్షులు సత్తయ్య, సుల్తానాబాద్ అధ్యక్షులు ఐలయ్య, ప్రధాన కార్యదర్శి బుర్కా సతీష్ వైస్ ప్రెసిడెంట్ డి శ్రీనివాస్, ధర్మారం అధ్యక్షులు మురళి తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే

- రాష్ట్ర పరిశీలకుల సమీక్ష




పెద్దపల్లి, ప్రతినిధి మార్చి 30 అక్షరం న్యూస్;

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎల్‌సీడీసీ (ూవజూతీశీంఎ ఝుంవ ఐవ్వష్ఱశీఅ ఝుఎజూఝుఱస్త్రఅ) సర్వే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 5 వరకు నిర్వహిస్తున్న ఇంటింటి కుష్టు వ్యాధి నిర్ధారణ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకులు డా. రాజు పరిశీలించారు. సోమవారం పీహెచ్‌సీ గర్రెపల్లి, పీహెచ్‌సీ రాఘవపూర్ పరిధిలోని సుగులాంపల్లి, పెద్దకల్వల గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి సర్వేను సందర్శించి ఫీల్డ్ సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.తదుపరి పెద్దపల్లి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారుల కార్యాలయంలో ఎల్‌సీడీసీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే శాశ్వత అంగవైకల్యాన్ని నివారించవచ్చని అధికారులు తెలిపారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, కుష్టు రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. భారతదేశంలో కుష్టు వ్యాధిని 2027 మార్చి 31 నాటికి పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు.శరీరంపై మొద్దుబారిన మచ్చలు లేదా రాగి రంగులో కనిపించే మచ్చలు ఉన్నవారు వెంటనే ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలని లేదా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి ఉచిత చికిత్స పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. సుధాకర్ రెడ్డి, రాష్ట్ర పరిశీలకుల బృంద సభ్యులు సకల రెడ్డి, వెంకటేశ్వర చారి, సురేందర్, అలాగే డీపీఎంఓలు బి. దేవి సింగ్, కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఉమా మహేశ్వర్‌కు ఘన సన్మానం

- పదవి విరమణ పొందిన అధికారికి ఘనంగా వీడ్కోలు
- హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్




పెద్దపల్లి ప్రతినిధి, మార్చి 30 అక్షరం న్యూస్;

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీ కత్తురోజు ఉమా మహేశ్వర్ పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమాన్ని సోమవారం పెద్దపల్లిలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ ఆయనను శాలువా కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, ఉమా మహేశ్వర్ గత 36 సంవత్సరాలుగా ప్రజా ఆరోగ్య శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తూ అంకితభావంతో సేవలు అందించారని పేర్కొన్నారు. సమయపాలన పాటించడం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం, విధేయతతో పని చేయడం ఆయన ప్రత్యేకతలని తెలిపారు.ఉమా మహేశ్వర్ పెద్దపల్లి జిల్లాలో హెచ్ఈఓగా పీహెచ్‌సీ రాఘవపూర్‌లో సేవలు అందించడంతో పాటు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పీహెచ్‌సీ కూనారం లో కూడా పనిచేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కీటక జనిత వ్యాధుల నివారణ విభాగంలో ఇన్‌చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారిగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందారు.ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు వక్తలు ఉమా మహేశ్వర్ వ్యక్తిత్వం, ఆయన అందించిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి. శ్రీరాములు, డాక్టర్ కె.వి. సుధాకర్ రెడ్డి, డాక్టర్ రాజమౌళి, డాక్టర్ బి. కిరణ్ కుమార్, వైద్య అధికారులు డాక్టర్ మమత, డాక్టర్ నిస్సీ క్రిస్టియన్, డాక్టర్ సంపత్, డాక్టర్ భావన, డాక్టర్ హరికిషన్ పాల్గొన్నారు. అలాగే ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, సంఘ నాయకులు వీరగోని శ్రీనివాస్, దేవిసింగ్, భరత్, కలీల్, దయామని, సాలమ్మ, లక్ష్మణ్, నర్సయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఉమా మహేశ్వర్ కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శిశు ఆసుపత్రిలో మరో క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం

- డాక్టర్ల బృందాన్ని అభినందించిన సూపరింటెంట్ డాక్టర్ శ్రీధర్



పెద్దపల్లి, ప్రతినిధి మార్చి 30 అక్షరం న్యూస్;

పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ మాతా-శిశు ఆసుపత్రిలో వైద్యులు మరో క్లిష్టమైన శస్త్రచికిత్స ను విజయవంతం గా నిర్వహించారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన 45 ఏళ్ల మహిళ తీవ్ర కడుపు నొప్పి, అధిక రక్తస్రావంతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి చేరుకున్నారు. వైద్యులు ఆమెను సమగ్రంగా పరీక్షించగా గర్భాశయంలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు.

దీనితో ఆధునిక వైద్య విధానంలో హిస్టరెక్టమీ శస్త్రచికిత్సను నిర్వహించి గడ్డను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో గైనకాలజిస్ట్ డాక్టర్ అనసూయ, అనస్థీషియా నిపుణుడు డాక్టర్ రామం పాల్గొన్నారు. విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన వైద్య బృందం, ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశు సంరక్షణ కేంద్రం సేవలు, 2డి ఎకో పరీక్షలు, ఆధునిక లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ సేవలు, రూట్ కెనాల్ చికిత్సలు వంటి అనేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సానిటేషన్, వాష్‌రూమ్ శుభ్రత లేదా ఇతర సేవల విషయంలో ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎమ్ఓ లేదా సూపరింటెండెంట్‌ను నేరుగా సంప్రదించాలని తెలిపారు. అవసరమైతే ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్‌లో కూడా నమోదు చేయవచ్చని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందుతున్నాయని, ఎవరికి కూడా లంచాలు ఇవ్వవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఉగాది పురస్కారం అవార్డు అందుకున్న సీనియర్ జర్నలిస్ట్ జబ్బార్ ఖాన్



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) మార్చి 30 అక్షరం న్యూస్:

కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ జబ్బార్ ఖాన్ కు ఉగాది పురస్కారం జాతీయ అవార్డును అందుకున్నారు. గోదావరిఖని లోని రాధాకృష్ణ గార్డెన్లో తార ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేష్ ఆధ్వర్యంలో జాతీయ ఉగాది పురస్కారాలు, నల్ల వజ్రం అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జబ్బార్ ఖాన్ గత 33 సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతూ వివిధ ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది. జబ్బార్ ఖాన్ చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలకు గుర్తించి ఆయనకు తార ఆర్ట్స్ అకాడమీ వారు ఉగాది పురస్కారం అవార్డుకు ఎంపిక చేశారు. దీంతో రామగుండం మున్సిపల్ మేయర్ మహంకాళి స్వామి, ఎస్సీ ఎస్టీ జాతీయ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్, వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేష్, రామగుండం మున్సిపల్ డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, ఎన్సిపి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్ తో పాటు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమానికి మేజిక్ రాజా, నరసయ్య ఇలా వ్యాఖ్యానం అలరించింది. తనను గుర్తించి ఉగాది పురస్కారం అవార్డు ఇవ్వడం పట్ల తార ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకే రాజేష్ కు , దయా నర్సింగ్, మేజిక్ రాజా, జనగామ రాయనరసు, కవ్వంపల్లి స్వామి , దామెర శంకర్ లకు .జబ్బార్ ఖాన్ కృతజ్ఞతలు తెలియజేశారు. జబ్బార్ ఖాన్ అవార్డు రావడం పట్ల ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు , కాంగ్రెస్ నాయకులు లల్లు, వడ్లకొండ శంకర్, ఇక్బాల్ గుండారం గ్రామ సర్పంచ్ జంగిలిపోచాలు, ఉప సర్పంచ్ అంబీరి రాజేందర్ తోపాటు గుండారం గ్రామానికి చెందిన బొడ్డు రవి, దండేసది, ముకుంద శ్రవణ్, మెతుకు ఈశ్వర్, అవునూరి అర్జున్, కామెరా శంకర్, హర్షం వ్యక్తం చేశారు.

## ప్రతి నెల రెండు మెడికల్ బోర్డులు నిర్వహించాలి

- ఆర్జీ 3 తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య
- జిఎం కార్యాలయ ముట్టడి పర్సనల్ విభాగ అధిపతికి వినతి పత్రం అందజేత



రామగిరి (పెద్దపల్లి జిల్లా) మార్చి 30 అక్షరం న్యూస్:

దేశాభివృద్ధికి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేస్తున్న బొగ్గు గని కార్మికులు అనారోగ్యంతో బాధపడుతూ, డ్యూటీలు చేయలేకపోతున్నారు కావున ప్రతినెల రెండు మెడికల్ బోర్డు నిర్వహించి వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని ఆర్జీ 3 తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య కోరారు . సోమవారం తెలంగాణ బొగ్గు గాని కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ , రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి పిలుపుమేరకు ఆర్జీ 3 జిఎం ఆఫీస్ ముట్టడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అర్జీ త్రీ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా వినతి పత్రం పర్సనల్ విభాగం యాజమాన్య ప్రతినిధికి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా నాగేల్లి సాంబయ్య మాట్లాడుతూ ప్రతినెలలో రెండు మెడికల్ బోర్డులు నిర్వహించాలని కోరడం జరిగింది. దేశాభివృద్ధికి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేస్తున్న బొగ్గు గని కార్మికులు అనారోగ్యంతో బాధపడుతూ, డ్యూటీలు చేయలేకపోతున్నారు. డ్యూటీలకు హాజరు కాకపోవడం వలన జీతం రాక, అప్పుల పాలవుతున్నారు. కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నారు. దేశంలోని ఇతర పరిశ్రమలకు భిన్నంగా బొగ్గు గని కార్మికులు పనిచేస్తారు. పని స్థలాలు కాలుష్యంతో, ప్రమాదాలతో నిండి ఉంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని గతంలో వారసత్వ ఉద్యోగాలను కల్పించారు. చంద్రబాబు నాయుడు మరియు కాంగ్రెస్ ప్రభుత్వాలు కుట్రపూరితంగా వారసత్వ ఉద్యోగాలను రద్దు చేసి సింగరేణి కార్మిక కుటుంబాలకు తీరని ద్రోహం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, మాజీ సి ఎం కెసిఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, సాహసోపేతంగా తిరిగి కారుణ్య నియామకాల పేరిట కార్మికుడి వారసులకు ఉద్యోగాలను పునరుద్ధరించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సింగరేణి కార్మికులకు ప్రతి నెలలో రెండు మెడికల్ బోర్డులు నిర్వహించి, అధిక సంఖ్యలో కారుణ్య ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అదేవిధంగా ఏఐటియుసి, ఐ ఎన్ టి యు సి సంఘాలు కూడా సింగరేణి ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. వీరి మాటలు నమ్మిన కార్మికులు మోసపోయారు. గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డు నిర్వహించకుండా కార్మికుల జీవితాలతో సింగరేణి యాజమాన్యం,రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాట మాడుతున్నది. కారుణ్య నియామకాలలో అవినీతి, అక్రమాలు జరిగాయని వీటిపై ఏసీబీ మరియు విజిలెన్స్ విచారణ చేస్తున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. విచారణ పేరుతో మెడికల్ బోర్డును నిర్వహించకుండా నిలిపివేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తప్పు జరిగితే దోషులను శిక్షించండి. కానీ విచారణ పేరుతో మెడికల్ బోర్డు నిర్వహణను నిలిపివేయడం సరియైనది కాదు. తక్షణమే మెడికల్ బోర్డు నిర్వహించి, అర్హులైన వారందరిని "అన్ ఫిట్" చేసి వారి వారసులకు ఏలాంటి జాప్యం లేకుండా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రతినెల రెండు మెడికల్ బోర్డులను నిరంతరాయంగా నిర్వహించాలి,మెడికల్ అన్ ఫిట్ చేయబడిన కార్మికుడి వారసులు సింగరేణి నియమ,నిబంధనల మేరకు అర్హత కలిగి, ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారికి తక్షణమే ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలి. జూలై, నవంబర్ నెలలలో అర్హత కలిగి, అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు అన్ ఫిట్ చేయలేదు. వారికి తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించాలి,విజిలెన్స్ మరియు మారుపేర్ల సమస్యను పరిష్కరించాలి. మెడికల్ బోర్డు రద్దుకై సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను విరమించుకోవాలి. గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తున్న 2వేలకు పైగా కార్మికులకు న్యాయం చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు ఈసంపల్లి రమేష్, దేవ శ్రీనివాస్, ఊరడి రమేష్, గట్టు శ్రీనివాస్ ఫిట్ సెక్రటరీలు వేముల రవి శంకర్, భోగం పూర్ణకర్, పూసాల శేఖర్, కొప్పుల సురేష్, దేవరకొండ తిరుపతి, కొత్తపల్లి సదానందం, శ్రీకాంత రావు, పిట్టల సదయ్య, కోలిపాక రాజయ్య, సందీప్ రెడ్డి, సతీష్, రమేష్, బాపు రావు, చిప్ప సురేష్, గండి శ్రీనివాస్, కుమ్మరి కుంట వెంకటేష్, ప్రదీప్, బర్ల సుధాకర్, దద్దల చంద్రశేఖర్,సైండ్ల.సత్యం, పిడుగు సురేష్ పోన్నం సదయ్య, కమటం రామస్వామి, బండి రాజా గౌడ్, కాసర్ల తిరుపతి, మామిడిపల్లి శ్రీనివాస్, గొట్టే శ్రీనివాస్, బత్తుల దేవేందర్, ఎస్.కె ముజాఫర్ అలీ, మిట్టపల్లి శంకర్, గుమాస దేవాజి , పొన్నం రాయమల్లు, గాండ్ల సతీష్, బీరం సంజీవ్, గూడ సంతోషం తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు ఆసుపత్రిలో సత్వర వైద్య సేవలు అందించేలా చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- వైద్య శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి, ప్రతినిధి మార్చి 30 అక్షరం న్యూస్;

రోగులకు ఆసుపత్రిలో సత్వర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వైద్యశాఖ పని తీరు పై లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,లి ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు ఓ.పి. రిజిస్ట్రేషన్ చేయడం వల్ల ఎక్కువ మంది రోగులకు సేవలు అందించ లేకపోతున్నామని, ప్రతి విభాగంలో రోజుకు నిర్దిష్ట సంఖ్యలో టోకెన్ లు జారీ చేసి ఓపి సేవలు నిర్వహించాలని, అనంతరం వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో ఆర్థో , డెంటల్, జనరల్ మెడిసిన్, గైనిక్, చిన్నపిల్లల స్పెషలిస్ట్, కంటి చికిత్స మొదలగు వివిధ విభాగాలలో ఎన్ని ఓపి టోకెన్లు ఉన్నాయో తెలియజేస్తూ డిస్ ప్లే బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ల్యాబ్ టెస్ట్ పరీక్షల ఫలితాలు రోగులకు త్వరగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజు జరిగే వైద్య పరీక్షలకు సంబంధించి నివేదిక అందజేయాలని, ఉదయం జరిగే పరీక్షలకు సాయంత్రం వరకు ఫలితాలు రోగులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో ల్యాబ్, ఎక్స్ రే రూమ్, వివిధ ఓపీ రూమ్, ఇతర విభాగాలకు దారి చూపే విధంగా సింబల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారుఆసుపత్రిలో ప్రతిరోజు ఎన్ని ఎక్స్ రే, స్కానింగ్ పరీక్షలు, రక్త పరీక్షలు జరుగుతున్నాయో నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్స్ రే యంత్రం, అవసరమైన స్టాఫ్ నియామకం కోరుకో ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. రోగులకు వైద్యులు ఆసుపత్రిలో పని వేళలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్,డి సి హెచ్ ఓ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టీచర్లందికీ ఒకటోతేదీనే జీతాలు ఇవ్వాలి

- మండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయు జీతాలపై ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



పెద్దపల్లి ప్రతినిధి మార్చి 30 అక్షరం న్యూస్;

అన్నిశాఖలను ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చే ఆలోచన చాలా మంచిదన్నారు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య. లిమండలిలో సోమవారం ప్రవేశ పెట్టిన తెలంగాణ వైద్య విధాన పరిషత్ (రద్దు) బిల్లుపైలి మాట్లాడిన ఆయన.. వివిధశాఖలు విడివిడి ఉండటం వల్ల కొంత కన్ఫ్యూజన్ ఉండేదన్న ఆయన.. ఇప్పుడు ఈ బిల్లు ద్వారా అన్నిశాఖలను ఒకే మంత్రిత్వశాఖ పరిధిలోకి వచ్చేలా స్ట్రీమ్ లైన్ చేయడం శుభపరిణామం అన్నారు. ఈ బిల్లును స్వాగతిస్తున్నామన్న ఆయన.. అలాగే లివిద్యాశాఖ పరిధిలో101 పద్దతిలో వేర్వేరు తేదీలలో వేతనాలు చెల్లింపుల సమస్యలున్నాయనీ.. ఈ సమస్య కూడా పరిష్కరించి టీచర్లందికీ ఒకటోతేదీనే జీతాలు అందేలా చూడాలని సూచించారు మల్క కొమరయ్య.

## పశువులకు గాలి కుంటునివారణటీకాలు





మహబూబాబాద్ జిల్లా /గంగారం/ మార్చి 30(అక్షరం న్యూస్ )

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం లోని కోమట్లగూడెం (గామీణవైద్యశాలు పరిధిలో పశువులు గాలి కుంటు నివారణ టీకాలు వేసినట్లు (గామ పశువైద్యాధికారి రమేష్ తెలిపారు సోమవారం మండలం లోని కోమట్లగూడెం పశువైద్యశిభిరాన్ని నిర్వహించారు ఈకార్యక్రమంలో బాగంగా 50ఆవులు 20గేదేలకు ఉచితంగా గాలి కుంటు నివారణ టీకాలనువేసినట్లు వివరించారు మండల వ్యాప్తంగా అన్ని (గామాలలోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఇవ్వడం జరుగుతుందని రైతులందరు దీనిని సద్వినియోగం చేసుకోనిపశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేయించేందుకు సం(పదించాలని సూచించారు ఈకార్యక్రమంలో సర్పంచ్ గుంట రామారావు వార్డు మెంబెర్ జనగం రవి పశువైధికారి రమేష్ గోపాలమీ(త సుర్ణపాక సతీష్ చింత రవి రైతులు తదితరులు పాల్గొన్నారు

# రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/30 మార్చ్/ అక్షరం న్యూస్: జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు . సోమవారం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడి వైద్య సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాలపై రోగులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని లాబరేటరీలో నిర్వహిస్తున్న పరీక్షా విధానాన్ని పరిశీలించి,





పరీక్షలు నాణ్యతగా నిర్వహించాలని సూచించారు. అలాగే మందుల గిడ్డంగిని తనిఖీ చేసి, అవసరమైన అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో రోజువారీ ఓపీకి ఎంతమంది రోగులు వస్తున్నారో తెలుసుకున్నారు. రక్త పరీక్ష కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షల వివరాలు, అందుబాటులో ఉన్న టీకాల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సేవల స్థితిగతులు, అవసరమైన ఔషధాల లభ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుక్క కాటుకు గురైన ఒక బాలుడిని పరామర్శించి, అతనికి అందిస్తున్న చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని స్పష్టం చేశారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ, ప్రజలకు సమర్థవంతమైన మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వైద్య సేవల మెరుగుదలకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీ లో మెడికల్ ఆఫీసర్ స్వప్న టిపిఎమ్ఓ ఫార్మసిస్ట్ స్టాఫ్ నర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి హెడ్డాఫీస్ ముట్టడి ఉద్రిక్తత

- పోలీసులు, నేతల మధ్య తీవ్ర వాగ్వివాదం..తోపులాట
- సిపిఐ నేతలు నారాయణ, సాబీర్ పాషా, యూనియన్ నాయకులు వాసిరెడ్డి, రాజ్ కుమార్ అరెస్టు
- నేతల నిర్బంధం..1 టౌన్ పోలీస్టేషన్కు తరలింపు
- సింగరేణి సిరిని దోచుకుంటున్న కేంద్ర, రాష్ట్ర పాలకులు
- రూ.50వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలి
- కొత్త గనుల ప్రారంభంపై యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం
- ఏసీబీ విచారణ సాకుతో మెడికల్ బోర్డును నిలిపివేయడం సరైంది కాదు
- కాంట్రాక్టు కార్మికులకుహైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయండి
- డిపెండెంట్ల ఉద్యోగాల విషయంలో కాలయాపన చేస్తే ప్రతిఘటన తప్పదు
- డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె సైరన్ మోగిస్తాం
- సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/30 మార్చ్ / అక్షరం న్యూస్ : సింగరేణి పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వర్కర్స్ యూనియన్ చేపట్టిన సింగరేణి హెడ్డాఫీస్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. కోల్ బెల్ట్ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వేలాది మంది కార్మికులు, యూనియన్ కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు, హెడ్డాఫీసు చేరుకొని ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి




ధర్నా చేశారు. పోర్లు దండాలతో విన్నూత రీతీలో నిరసన వ్యక్తం చేశారు. మూడు గంటలపాటు ధర్నా చేపట్టడంతో పోలీసులు అడ్డుకోవడంతో నేతలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకోవడంతో హెడ్డాఫీసు ఏరియా ఉద్రిక్తంగా మారింది. సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె నారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషాతోపాటు యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ తదితరులను పోలీసులు నిర్బంధించి 1 టౌన్ పోలీస్ స్టేషన్'కు తరలించారు. అరెస్టులకు ముందు కార్మికులనుద్దేశించి సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ మాట్లాడారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రూ. 50 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలనీ, ఆ నిధులను ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త గనుల ప్రారంభంపై యాజమాన్యం చూపుతున్న నిర్లక్ష్యం సంస్థ మనుగడకే ముప్పు అని, ఏసీబీ విచారణ సాకుతో మెడికల్ బోర్డును నిలిపివేయడం కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సిరిని దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు.



కార్మికుల కష్టంతో మనగడ సాగిస్తున్న సింగరేణి సంస్థ కార్మికులను నట్టేట ముంచేందుకు ప్రయత్నిస్తుందని, ఇందులో మితిమీరిన రాజకీయ జోక్యమే కారణం అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇచ్చిన ఎ ్ ీ వీ ం ల న ం ని ల బె ట్టు కో క ం ం టే రాబోయే రోజుల్లో మరిన్ని



గట్టి పోరాటాలు నిర్వహిస్తామని, అవసరమైతే సింగరేణి కార్యాలయాలను స్వాధీనం చేసుకొని తమ సత్తా చాటుతామని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, సొంత ఇంటి పథకం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్లర్క్ పోస్టులకు కోర్టు కేసులతో సంబంధం లేకుండా పరీక్షలు జరపాలని, 350 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎ క్స్ గ్రే షి య ా ప్ర క టిం చాల న్నా రు. సింగరేణి ఏరియాలో కాంగ్రెస్కు ఓట్లు పడ్డాయి అంటే అది కేవలం సింగరేణి కార్మికుల వల్లే అనీ, కోరి తెచ్చుకున్న ప్రభుత్వం కార్మికుల నెత్తిన చెయ్యి పెడుతుందని మండిపడ్డారు. సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మెడికల్ బోర్డు వల్ల సింగరేణికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ప్రకటించటం దుర్మార్గమని, కార్మిక సంక్షేమం కోసం ఆలోచన చేయాల్సిన పాలకులు లేనిపోని మాటలతో కార్మికులను మనస్థాపానికి గురి చేయటం మంచిది కాదని హితవు పలికారు. కొత్త గనులు ఏర్పాటు చేసే క్రమంలో ప్రైవేటు పెత్తనానికి స్వస్తి చెప్పి సింగరేణి కార్మికులతోనే బొగ్గు ఉత్పత్తిని చేయాలని, పాత పద్ధతిలోనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కోరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కార్మికుల గొంతుకగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ డిమాండ్లు నెరవేర్చకుంటే సింగరేణి వ్యాప్తంగా సమ్మె సైరన్ మోగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, నాయకులు మిర్యాల రంగయ్య, కె సారయ్య, వీరభద్రం, వైవి రావు, ముస్కె సమ్మయ్య, వంగ వెంకట్, జి వీరాస్వామి, ఎస్ వి రమణమూర్తి, వి మల్లికార్జున్ రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.








# మెడికల్ బోర్డు నిర్వహించాలని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కాపుకృష్ణ ముఖ్య ప్రధాన కార్యదర్శి జియం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి జియం శాలంరాజు గారికి మెమొరండం ఇవ్వడం జరిగింది



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/30 మార్చ్/ అక్షరం న్యూస్ :కొత్తగూడెం ఏరియా జియం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి జియం కు మెమొరండం టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య ఆధ్వర్యంలో చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపుకృష్ణ పాల్గొని జియం వినతి పత్రం అందించడం జరిగింది. జూలై , నవంబర్ నెలలో అర్హత కలిగి అన్ఫిట్ చేయని కార్మికులకు తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించాలి. విజిలెన్స్ లో ఉన్న మారుపేరుల సమస్యను వెంటనే పరిష్కరించాలి. ఏఐటియుసి , ఐ ఎన్ టి యు సి కార్మిక సంఘాలు, కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలి. గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున రెండు వేలకు పైగా కార్మికులన్యాయం చేయాలి. సింగరేణి యాజమాన్యం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి .వీకే కోల్ మైన్ ను సింగరేణి యంత్రాలతో సింగరేణి ఉద్యోగులతో బొగ్గు వెలికి తీయాలికొత్తగూడెం ఏరియా లో సర్ప్లస్ లో ఉన్న కాళిలను పీవీకే అండర్ గ్రౌండ్ కార్మికుల తో పరదర్శకంగా ఎటువంటి పైరవీలు లేకుండా నింపాలి. జే వి ఆర్ ఓ సి లో డిప్యూటేషన్ పై చేస్తున్నా కార్మికుల అందరిని వీకే కోల్ మైన్ కు తీసుకోని రావాలి. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ , కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య కార్పొరేట్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ మెంబర్ బోరింగ్ శంకర్, బురుగుల రవికుమార్, ఎంటెక్ మహేందర్, కంచర్ల శ్రీనివాస్, నెమల్ల వెంకటేశ్వర్లు , సూరజ్, జిమ్మిడి అనుదీప్, మారపాక తిరుపతి, రాజేష్, అహరోన్,పిచ్చయ్య,అమరేందర్ ,సత్యనారాయణ, అనుదీప్ బాల, రఫీ , ఎం. శ్రావణ్ కుమార్,, కే శ్రీనివాస్ , రవి వర్మ , సుధీర్ కుమార్ ,సూరిబాబు,అమృత రావు ,సందేశ్, హరి,దీపక్ ,సుందర్లాల్,సుధాకర్, సంతోస్, తాత రావు, రాజ్ కుమార్, షణ్ముఖ్, సమీర్, షోయబ్, రాజు,ఉద్యోగస్తులు, తదితరులు,పాల్గొన్నారు.



# ఫ్లెక్సీలను తొలగించండి పర్యావరణాన్ని కాపాడండి

- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/30 మార్చ్ / అక్షరం న్యూస్ : కొత్తగూడెం నియోజకవర్గంలో గత కొ ం త ్ కా ల ం గా అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను తొలగించాలని జై భీమ్ రావు భారత్ పార్టీ(జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ గ్రీవెన్స్ డే ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ కు ఫిర్యాదు చేశారు. ఈ సంధర్భంగా కామేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు జాతీయ ప్రధాన రహదారుల సెంటర్ పోల్స్ కు అడ్డగోలుగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రమాదాలకు కారణం అవుతున్న ఫ్లెక్సీ షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాలని,విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం మూలంగా పర్యావరణానికి హాని కలిగించే విధంగా వారి చర్యలు ఉన్నాయన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ తో పాటు జిల్లాలోని వివిధ మండలాలలో ఏ విధమైన అనుమతులు లేకుండా పెద్ద పెద్ద హోర్డింగులను ఏర్పాటు చేసినా సంబంధిత మున్సిపల్ మరియు పంచాయితీ సిబ్బంది చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నప్పటికీ ఏ విధమైన అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న సదరు ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులపై చర్యలు తీసుకుని ప్రకృతిని కాపాడాలని కోరారు. గతంలో ఇక్కడ కలెక్టర్ గా విధులు నిర్వహించిన అనుదీప్ జిల్లా అంతటా ఫ్లెక్సీ హోర్డింగ్ లను తొలగించిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తు చేశారు. తక్షణమే స్పందించి కొత్తగూడెం కార్పొరేషన్ మరియు జిల్లాలోని వివిధ మండలాలలో పర్యావరణానికి హాని కలిగించే విధంగా ప్లాస్టిక్ తో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకొని అనుమతులకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హోర్డింగులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లిజిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,కొండా విజయభాస్కర్,ప్రమోద్‌లి తదితరులు పాల్గొన్నారు.



# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

హైదరాబాద్, మార్చి 30 ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. రానున్న రెండు నెలలు దారుణంగా ఉండే పరిస్థితులు కానవస్తున్నాయి. వాతావరణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో ప్రజాప్రయోజనం కనిపించదని తెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రజలు జాగరూకులై ఉండాల్సిందే. ఏటా ఎండాకలం అనగానే మంచినీటి సమస్య, సాగునీట సమస్యలు వస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పక్కా ప్రణాళికలు లేకపోవడం వల్ల ఈ సమస్యలు వస్తున్నారు. దేశవ్యాప్తంగానూ, తెలుగు రాష్ట్రాల్లోనూ సాగు,తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చివరి భూములకు నీరు అందక అప్పుడే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం అనేక జిల్లాల్లో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టడం లేదు. జనాభా పెరుగుదల కారణంగా నీటి సరఫరా సమస్యలు వస్తున్నాయి. నీటి వనరులు లేని



ప్రాంతాల్లో తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోంది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధకారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవు తుందని గుర్తించడం లేదు. భూమిలో బోర్లు వేసి నీటిని తోడుతున్నా, నీటిని రీఛార్జ్ చేయలేక పోతున్నాం. మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. అని గుర్తించి అందుకు అనుగుణంగా గట్టి చర్యలు తీసుకోవడం లేదు. నీరు లేకుండా జీవం లేదు. నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. నీటి సమస్య ముందుగా బాధించేది మహిళలనే. ఇప్పటికీ ట్రైబల్ ఏరియాలో నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీయులు సుదూరాలకు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయిం పులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మిషన్ భగీరథ ప ఏరుతో భారీ కుంభ కోణం చేసిన గత బిఆర్ఎస్ పాలకులు దానిని కప్పిపుచ్చుకునేందుకు నానా గడ్డీ కరుస్తున్నారు. చెరువుల పునరుద్దరణ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు దండుకున్నారు. మనకు జీవనదులు, సహజ నీటి చెరువులు పుష్కలంగా ఉన్నా వాటి నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా ప్రయత్నాలు జరగడం లేదు. జరిగే ప్రయత్నాల వెనక భారీ కుంభకోణాలు దాగి వుంటున్నాయి. జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెటెక్కుతారు. నదీ జలాలలను సక్రమంగా పొలాలు, ఇళ్లకు మళ్లించేలా ప్రణాకలు చేపట్టలి. రాష్ట్రాల మధ్య జలజగడాలను ఆపి, నీటి సద్వినియోగం చేసుకోవాలి. ఏటా లక్షల క్యూసెక్కులు సముద్రం లో కలిసి పోకుండా ప్రణాళికులు చేపట్టాలి. అప్పుడే సాగు, తాగునీటి సమస్యలకు చెక్ పడుతుంది.

# బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

### బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా



పాట్నా,మార్చి30 బీహార్ ముఖ్య మంత్రి నితీష్‌కుమార్ శాసనమండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక అనంతరం రాజ్యంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్యసభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. అలాగే బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా బీహార్ శాసనమండలికి రాజీనామా చేశారు. ఆయన కూడా మార్చి 16న రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన కూడా శాసనమండలికి రాజీనామా చేశారు. కాగా, 2005లో ఎన్‌డిఎ కూటమి తరపున నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక బిజెపికి మద్దతుగా, ఆ తర్వాత ఆ పార్టీని వ్యతిరేకిస్తూ మహాగట్బంధన్ వైపు మద్దుతుగా నిలిచి తన సిఎం పదవిని కాపాడుకున్నారు. 2013, 2017, 2022, 2024లో పార్టీలు మారుతూ సిఎంగా కొనసాగారు. 2025లో అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రికార్డు స్థాయిలో విజయం సాధించి పదవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు.

# నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

### సింగరేణికి సమంబంధించి పలు సూచనలు చేసిన కాగ్




హైదరాబాద్,మార్చి30 తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలపాలు, లాభ నష్టాలపై కాగ్ నివేదిక విడుదల అయింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కాగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలకు కాగ్ పలు సిఫారసులు చేసింది. నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుని సమీక్షించాలని సూచించింది. నష్టాల్లో ఉన్న కంపెనీలను ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా పూర్తిగా మూసివేయడం చేయాలని పేర్కొంది. అలాగే సింగరేణి కంపెనీకి కూడా పలు సూచనలు చేసింది. ఓబీఆర్ కాంట్రాక్టుల్లో భద్రతా నిబంధనలు మార్చాలని, బొగ్గు రవాణా ఛార్జీలను సమీక్షించాలని సూచించింది. తవ్విన గనులను తిరిగి నింపడానికి నది ఇసుకకు బదులు ప్రాసెస్ చేసిన బూడిద లేదా గనుల ఉపరితల పదార్థాలను వాడాలని తెలిపింది.రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు, వాటిలో 16 సంస్థలు మూతపడినట్టు లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. మిగిలిన 67 సంస్థల్లో 49 ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయని పేర్కొంది. దీంతో కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో 11 నష్టాల్లో ఉన్నాయని, కేవలం 6 సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని కాగ్ తెలిపింది. తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్టు వెల్లడించింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదని, ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని పేర్కొంది. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేదని, 9 సంస్థల్లో ఎన్ఆర్సీ కమిటీ ఏర్పాటు కాలేదని తెలిపింది.

## బంగారం ధరల్లో ఒడిదుడుకులు

### స్వల్పంగా తగ్గిన పసిడి రేట్లు



హైదరాబాద్,మార్చి30 పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. డాలర్ రేటు పెరగటం బంగారం ధరలు పతనమవ్వడానికి మరో కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది పెట్టుబడిదా రులకు అద్భుతమైన రిటర్న్ ఇచ్చిన బంగారం.. ఇప్పుడు కంటతడి పెట్టిస్తోంది. యుద్ధం మొదలవ్వడానికి ముందు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1.90 లక్షల రూపాయల వరకు వెళ్లింది. యుద్ధం మొదలవ్వగానే బంగారం ధరలు ధమాల్ అని పడిపోయాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,48,090 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,750 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,11,070 దగ్గర ట్రేడ్ అయింది. సోమవారం 24 క్యారెట్‌పై 810 రూపాయలు.. 22 క్యారెట్‌పై 750

రూపాయలు.. 18 క్యారెట్‌పై 610 రూపాయలు తగ్గింది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో.. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,47,280 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,000 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,10,460 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## ఆటో బోల్తా: తల్లీ కుమారుడు మృతి

కామారెడ్డి,మార్చి30 కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల శివారులో ఘోర ప్రమాదం జరిగింది. ఆటో బోల్తాపడిన ఘటనలో తల్లీకుమారుడు మృతి చెందగా.. 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓ వేడుకకు వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది.

## ములుగు జిల్లాలో ఈదురుగాలుల వర్షం

### చెట్టుకూలి రోడ్డుపై పడడంతో ట్రాఫిక్ జామ్

ములుగు,మార్చి30 జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఏటూరునాగారం –తాడ్వాయి మధ్య ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. భారీ ఈదురుగాలులతో రహదారులపై చెట్లు పడిపోయాయి. దీంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. జేసీపీ సాయంతో చెట్లను తొలగించి పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసారు. మరో వైపు రాష్ట్రంలోని పలు జిల్లాలకు వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. హైదరాబాద్ తో పాటు జగిత్యాల,కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్, ములుగు,నాగర్ కర్నూలు, నల్గొండ,రంగారెడ్డి, సంగారెడ్డి,సిద్దిపేట,వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు,మెరుపులతో తేలికపాటి వర్షానికి చాన్స ఉంది. హైదరాబాద్ లో మార్చి 30న రాత్రి భారీ వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు ,మెరుపులతో కూడిన వర్షం పడుతుందని చెప్పింది. టోలీ చౌకీ, నాంపల్లి,మలక్ పేట, ఆసిఫ్ నగర్, కార్వాన్, గోషామహల్,మెహదీపట్నం, చార్మినార్, అత్తాపూర్ ,మసాబ్ ట్యాంక్,కూకట్ పల్లికి అలర్ట్ జారీ చేసింది. ఖైరతాబాద్,అబిడ్స్ ,సికింద్రాబాద్,ఉప్పల్, ఎల్బీనగర్, చార్మినార్ ,కంటోన్మెంట్ ,కాప్రా,మల్కాజ్ గిరిలో తేలికపాటి మోస్తారు వర్షం పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

## గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

### ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ

హైదరాబాద్,మార్చి30 గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ లో ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామని అన్నారు. గిగ్ వర్కర్లతో స్వయంగా మాట్లాడి డ్రాఫ్ట్ బిల్లు రెడీ చేశామని అన్నారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల డ్రాఫ్ట్ బిల్లుపై కంపెనీలతో 5 సార్లు మీటింగులు పెట్టామని...చట్టం తీసుకొస్తే కంపెనీలకు ఎలాంటి నష్టం ఉండదని వివరించామన్నారు. గిగ్ వర్కర్లకు ప్రభుత్వం అండగా స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామన్నారు వివేక్. మొదటిసారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి తప్పు చేస్తే రూ. లక్షా 50 వేలు పెనాల్టీ విధిస్తామని స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని అన్నారు. గిగ్ కార్మికుల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు 'సామాజిక భద్రత , సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలు, దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది. ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య

(యూఐడీ) కేటాయిస్తారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా వారికి అందుతాయి. అగ్రిగేటర్లు (సంస్థలు) జరిపే లావాదేవీల నుంచి 1శాతం నుంచి 2 వరకు నిధులను సేకరించి, వాటిని సంక్షేమ నిధికి జమ చేస్తారు. ఈ నిధిని కార్మికుల బీమా, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ , పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలకు ఉపయోగిస్తారు. యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించేందుకు బలోపేతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. ఇబ్బందుల నివారణకు ఎ÷–లాట్‌ఫాం స్థాయి కమిటీలు పనిచేస్తాయి. కార్మికులను పనిలో నుంచి తొలగించినా లేదా పేమెంట్లు ఆపేసినా.. తక్షణమే ఫిర్యాదు చేసేందుకు 'ఎ÷–లాట్‌ఫాం స్థాయి కమిటీలు' జిల్లా స్థాయి అధికారులతో కూడిన యంత్రాంగం ఉంటుంది.

# సైబర్ నేరగాడి ట్రాప్‌లో 6లక్షలు పోగొట్టుకున్న న్యాయమూర్తి

### పోలీసులు రంగంలోకి దిగడంతో మోసగాడి అరెస్ట్

ముంబై,మార్చి30 ఒక హైకోర్టు న్యాయమూర్తి, సైబర్ నేరగాడి ట్రాప్‌లో పడ్డారు. ఆ జడ్జికి ఒక లింక్ పంపిన అతడు రూ.6 లక్షల మేర ఆయనను మోసగించాడు. న్యాయమూర్తి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. చివరకు నిందితుడ్ని గుర్తించి అరెస్ట్ చేశారు. ముంబైలో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 28న బాంబే హైకోర్టు న్యాయమూర్తి తన క్రెడిట్ కార్డ్ పాయింట్లను రీడీమ్ చేసుకు నేందుకు ప్రయత్నించారు. ఆ బ్యాంకు కస్టమర్ కేర్ నంబర్‌ను సంప్రదించడానికి ప్రయత్నించగా బిజీ వల్ల లైన్ కలవలేదు. ఆ న్యాయమూర్తి బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్ కోసం ఇంటర్నెట్‌లో వెతికారు. ఒక నకిలీ నంబర్‌కు ఆయన కాల్ చేశారు. జడ్జితో మాట్లాడిన సైబర్ మోసగాడు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌గా నమ్మించాడు. ఆయనకు ఒక లింక్‌ను పంపి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. మరోవైపు ఆ న్యాయమూర్తి తన ఐఫోన్‌లో ఆ యాప్ డౌన్‌లోడ్ చేసేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో ఆండ్రాయిడ్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆ నకిలీ టెలీకాలర్ సూచించాడు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి తన సిమ్ కార్డును ఇంటి పనిమనిషి ఆండ్రాయిడ్ ఫోన్‌లో వేసి ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆ యాప్‌లో తన క్రెడిట్ కార్డు వివరాలను నమోదు చేసిన వెంటనే ఆయన ఖాతా నుంచి రూ. 6.02 లక్షలు విత్ డ్రా అయ్యాయి. కాగా, మోసపోయినట్లు గ్రహించిన ఆ బాంబే హైకోర్టు జడ్జి వెంటనే ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కఫ్ పరేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జార్ఖండ్‌లోని జామ్తారాలో నివసించే 25 ఏళ్ల మజార్ ఆలం ఇస్రాయిల్ మియాన్‌ను నిందితుడిగా పోలీసులు గుర్తించారు. జార్ఖండ్‌లోని జామ్తారా సైబర్ సెల్, కర్మతాండ్ పోలీసుల సహాయంతో పది రోజుల్లోనే నిందితుడ్ని అరెస్ట్ చేశారు. 10 రాష్ట్రాల్లో జరిగిన 36 సైబర్ మోసాల కేసులతో నిందితుడికి సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తెలిసిందని పోలీస్ అధికారి తెలిపారు.

## కేరళలో ఎల్‌డిఎఫ్‌లో బిజెపి కుమ్మక్కు

### ఎన్నికల ప్రచారంలో రాహుల్ ఆరోపణలు

తిరువనంతపురం,మార్చి30 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కు బీజేపీ పరోక్షంగా మద్దతిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పోటీ యూడీఎఫ్‌కు, సీపీఎం–బీజేపీ కంబైన్‌కు మధ్యే జరగనుందని అన్నారు. పట్టంనాంతిట్ట జిల్లాలోని అదూర్‌లో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, కేరళలో యూడీఎఫ్ ఉండకూడదని బీజేపీ కోరుకుంటోందని, ఎందుకంటే కాంగ్రెస్‌కు మాత్రమే జాతీయ స్థాయిలో బీజేపీని సవాలు చేయగలిగే శక్తి ఉందనే విషయం వాళ్లకు బాగా తెలుసునని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో తాము సైద్ధాంతిక పోరాటం చేస్తున్నామని తెలిపారు. విపక్ష నేతలను సెంట్రల్ ఏజెన్సీలు టా÷–గ్గ÷ట్ చేస్తున్నాయని, కానీ ఎల్డీఎఫ్‌పై మాత్రం ఎలాంటి దర్యాప్తులు ఉండవని రాహుల్ విమర్శించారు. తనపై 36 కేసులు పెట్టారని, 55 గంటల సేపు నిర్విరామంగా ప్రశ్నించారని అన్నారు. కేరళ సీఎం పినరయి విజయన్‌పై మాత్రం ఎలాంటి చర్యలు లేవన్నారు. ప్రధాని మోదీ ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని, కానీ ఇటీవల పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశాన్ని లేవనెత్తడం మరిచిపోయారని రాహుల్ విమర్శించారు. శబరిమలలోని అయ్యప్ప ఆలయంతో ముడిపడి ఉన్న అంశంపై మాట్లాడకపోవడం ద్వారా బీజేపీ, ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్టు స్పష్టమవుతోందన్నారు. యూడీఎఫ్ అధికారంలోకి వస్తే ఆలయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రూ.1,365 కోట్లు సాధించిన 'ధురంధర్ 2'

### దరుంధర్ చూసి పాఠాలు నేర్చుకోవాలన్న ఆర్జీవి



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర-2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లును ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో అంటూ వ్యాఖ్యానించారు. కళ్ళెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే, దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. 'ధురంధర్ 2' సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి' అని ఆర్జీవీ సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# సిఎస్‌కే బ్యాటర్ల విఫలం

### 127 పరుగులకే కుప్పకూలిన చెన్నై

### టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన సూపర్ కింగ్స్

### ఓవర్టన్ ఇన్నింగ్స్ నిలబెట్టడంతో గౌరవప్రదమైన స్కోరు



గౌహతి,మార్చి30(ఆర్ఎన్ఎ): చెన్నై జట్టు 19.4 ఓవర్లలో 127 పరుగులకు చేరుకుని ఆలౌట్ అయ్యింది. రాజస్థాన్ ముందు 128 పరుగుల లక్ష్యాన్ని విధించింది. ఐపీఎల్ 2026 సీజన్ లో భాగంగా సోమవారం గుహవటిలో చెన్నై సూపర్ కింగ్స్ రాజస్థాన్ రాయల్స్ తో తలపడింది. ముందుగా టాస్ గెలిచిన రాజస్థాన్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాంటింగ్ కు దిగిన చెన్నై ఆటగాళ్లు రాజస్థాన్ బౌలర్ల ధాటికి పెవిలియన్‌కు క్యూ కట్టారు. టాప్ ఆర్డర్ నుంచి మిడిల్ ఆర్డర్ వరకు ఏ ఒక్కరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. పవర్‌ప్లే ముగిసేసరికే ముగ్గురు కీలక బ్యాటర్లు పెవిలియన్‌కు చేరారు. రాజస్థాన్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తన వేగంతో చెన్నై ఓపెనర్లను బెంబేలెత్తించాడు. ఆ తర్వాత వచ్చిన మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు కూడా స్పిన్నర్ల ఉచ్చులో చిక్కుకున్నారు. ముఖ్యంగా రాజస్థాన్ తరపున ఆడుతున్న మాజీ సీఎస్‌కే ఆటగాడు రవీంద్ర జడేజా, తన పాత జట్టుపై కనికరం లేకుండా బౌలింగ్ చేసి కీలక వికెట్లు పడగొట్టాడు. ఒకానొక దశలో చెన్నై స్కోరు 80 పరుగుల వద్దే 7 వికెట్లు కోల్పోయి అత్యల్ప స్కోరుకే పరిమితమవుతుందని అభిమానులు ఆందోళన చెందారు. జట్టు పీకల్లోతు కష్టాల్లో ఉన్న సమయంలో జేమీ ఓవర్టన్ (43 పరుగులు) ఆపద్బాంధవుడిలా ఆదుకున్నాడు. టెయిలెండర్లతో కలిసి విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పిన ఓవర్టన్, రాజస్థాన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కొన్ని భారీ సిక్సర్లు, ఫోర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతని పోరాట పటిమ వల్లే చెన్నై జట్టు 19.4 ఓవర్లలో 127 పరుగులకు చేరుకుని ఆలౌట్ అయ్యింది. గౌరవప్రదమైన స్కోరు సాధించడంలో ఓవర్టన్ ఇన్నింగ్స్ కీలకంగా మారింది. ఃాజస్థాన్ బౌలింగ్ విభాగం అత్యంత క్రమశిక్షణతో బౌలింగ్ చేసింది. నాంద్రే బర్గర్, జోఫ్రా ఆర్చర్ తలా 2 వికెట్లు తీసి పేస్ అటాక్‌ను ముందుండి నడిపించారు. రవీంద్ర జడేజా తన స్పిన్ మ్యాజిక్‌తో మధ్య ఓవర్లలో చెన్నైని కోలుకోకుండా చేశాడు. రాజస్థాన్ రాయల్స్ ముందు ఇప్పుడు 128 పరుగుల స్వల్ప లక్ష్యం ఉంది. పిచ్ బౌలింగ్‌కు సహకరిస్తుండటంతో, చెన్నై బౌలర్లు కూడా గట్టిగా పోరాడితే మ్యాచ్ ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది.

## ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి..జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /30 మార్చ్ /అక్షరం న్యూస్:

ప్రజావాణి లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు.జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా, వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు.



**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు**

కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ వహాబ్, అశ్వరావుపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 911/33లో 5.00 గుంటల రిజిస్టర్ భూమి తన పేరున ఉన్నప్పటికీ, ఆర్ఎస్ఆర్ (=ూ=) సమస్య కారణంగా పట్టాదారు పాస్‌పుస్తకం అందలేదని తెలిపారు. తన పేరున పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం భూభారతి విభాగానికి ఎండార్స్ చేశారు.

టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామానికి చెందిన ఆంగోతు సంతులాల్, సర్వే నంబర్ 239/282లో వ్యవసాయ భూమి ఉన్నదని, గతంలో ఇంద్రజల ప్రభ పథకం కింద బోరు మరియు విద్యుత్ మంజూరు అయినప్పటికీ, మోటార్ మీటర్‌కు సర్వీస్ నంబర్ ఇవ్వలేదని తెలిపారు. తన విద్యుత్ కనెక్షన్ కొనసాగించేలా సర్వీస్ నంబర్ మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి విద్యుత్ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.అల్లపల్లి మండలం చెలగట్టు గ్రామానికి చెందిన కొమరం సారమ్మ, తన భర్త మరణంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, పీజీ (ఎంఏ) వరకు చదువుకున్న తన కుమార్తెకు ఉపాధి కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మేదరబస్తీ 53వ డివిజన్‌కు చెందిన శ్రీనివాస్, గత ఎనిమిదేళ్లుగా తమ ఇంటికి కిన్నెరసాని మంచినీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ నీటి బిల్లులు విధిస్తున్నారని తెలిపారు. నీటి బిల్లులను రద్దు చేసి కొత్త కనెక్షన్ మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎండార్స్ చేశారు.

పినపాక, ఏడుళ్ల బయ్యారం, జానంపేట మరియు టి. కొత్తగూడెం పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు, రంజాన్ మరియు బక్రీద్ పర్వదినాలలో సామూహిక నమాజ్ నిర్వహించేందుకు తగిన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈద్గా స్థలం కేటాయించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి పినపాక తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవ్ ఊచకోతకు బలైన చెన్నై.. భారీ విజయంతో రాజస్థాన్ బోణీ..!





ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ ఘనంగా ఆరంభించింది. ఆల్‌రౌండ్ షోతో చెన్నై సూపర్ కింగ్స్‌ను వణికించిన రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. 128 పరుగుల స్వల్ప ఛేదనలో వైభవ్ సూర్యవంశీ (52), యశస్వీ జైస్వాల్(38 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వైభవ్ అయితే.. ఫోర్లు, సిక్సర్లతో చెన్నై బౌలర్లను హడలెత్తించాడు. 15 బంతుల్లోనే రికార్డు హాఫ్ సెంచరీతో ఈ చిచ్చరపిడుగు లక్ష్యాన్ని కరిగించగా.. యశస్వీ క్లాస్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. బ్యాటింగ్, బౌలింగ్.. రెండు విభాగాల్లో దారుణంగా విఫలమైన సీఎస్కే ఘోర పరాభవం మూటగట్టుకుంది. పంతొమ్మిదో సీజన్‌లో వరసగా రెండు భారీ స్కోర్ల మ్యాచ్‌ల తర్వాతలో స్కోరింగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయ ల్స్ పంజా విసిరింది. ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు ముచ్చెమటలు పట్టిస్తూ భారీ విజయంతో బోణీ కొట్టింది. తొలుత సీఎస్కేను 127కే ఆలౌట్ చేసిన రాజస్థాన్.. వైభవ్ సూర్యవంశీ(52 : 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులతో స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది.

## తేలిపోయిన సంజూ శాంసన్

### చెన్నై జట్టులో నిరాశ పర్చిన సంజూ

గౌహతి,మార్చి30 ఐపీఎల్‌లో తొలిసారి చెన్నై సూపర్ కింగ్స్ కు ఆడుతున్న సంజూ శాంసన్ మొదటి మ్యాచ్‌లో తేలిపోయాడు. ఎన్నో అంచనాల మధ్య పసుపు జెర్సీతో క్రీజులోకి వచ్చిన సంజూ.. రెండో ఓవర్లోన క్లీన్‌బౌల్డయ్యాడు. నంద్రె బర్గర్ వేసిన ఆ ఓవర్లో చివరి బంతికి డిఫెన్స్ ఆడాలనుకున్న శాంసన్ అంచనా తప్పగా.. బంతి మెరుపు వేగంతో ఆఫ్ స్టంప్‌ను ఎగరగొట్టింది. కోట్లాదిమంది అభిమానగణమున్న సీఎస్కే తరపున సంజూ శాంసన్ అరంగేట్రం అదరలేదు. సిక్సర్లతో హోరెత్తిస్తాడని ఆశించిన అభిమానులను నిరాశపరుస్తూ ఆరు పరుగులకే ఔటయ్యాడీ హిట్టర్. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన సంజూను నంద్రె బర్గర్ బౌల్డ్ చేశాడు. డిఫెన్స్ ఆడాలనుకున్న అతడి అంచనా తప్పగా బంతి ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. తమ మాజీ కెప్టెన్ వికెట్ తీసిన సంతోషంలో బర్గర్ గాల్లోకి ఎగరగా.. సీఎస్కే అభిమానులు 'అయ్యో' అని తలపట్టుకున్నారు.

## వివాదంలో ఫుట్‌బాల్ ఫెడరేషన్ చీఫ్ కల్యాణ్ చౌబే



### వేధింపు ఆరోపణలు చేసిన మహిళల ఫుట్‌బాల్ కమిటీ ఛైర్మన్ వాలంకా

న్యూఢిల్లీ,మార్చి30 ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ చీఫ్ కల్యాణ్ చౌబేపై వివాదంలో చిక్కుకున్నారు. ఆయనపై ఏఐఎఫ్ఎఫ్ మహిళల ఫుట్‌బాల్ కమిటీ ఛైర్మన్ వాలంకా అలెమావో వేధింపుల ఆరోపణలు చేశారు. మార్చి 29న ఢిల్లీలోని ఫుట్‌బాల్ హౌస్‌లో జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. తనను సీనియర్ అధికారులు హేళన చేశారని, వేధించారని ఆరోపించారు. భారత మహిళల ఆసియా కప్ క్యాంపెయిన్‌లో భాగంగా పాలనాపరమైన లోపాలను ఇటీవల ఆమె ఎత్తిచూపిన నేపథ్యంలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం గమనార్హం.చౌబే, ఇతర సీనియర్ అధికారుల చర్యలను ప్రస్తావిస్తూ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌కు అలెమావో లేఖ రాశారు. 'చౌబే, ఏఐఎఫ్ఎఫ్ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.హారిస్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం.సత్యనారాయన్ ప్రవర్తనను మీ ముందు ఉంచాలనుకుంటున్నాను. నా గొంతు అణచివేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అధ్యక్షుడు నాతో అగౌరవంగా ప్రవర్తించారు. ఆయనతో కలిసి మిగిలినవారు స్వరం పెంచి, బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. సమావేశం జరుగుతున్నంతసేపు నన్ను టార్గెట్ చేశారని ఆమె ఆరోపించారు. ఇండియా ఫుట్‌బాల్ పాలకవర్గంలో వాలంకా కీలక వ్యక్తి. చర్చిల్ బ్రదర్స్ ఫుట్‌బాల్ క్లబ్ గోవాకు ఆమె సీఈఓగా ఉన్నారు. ఆమె తండ్రి చర్చిల్ అలెమావో గోవా ముఖ్యమంత్రిగా పని చేశారు. కొన్నేళ్లపాటు ఆ క్లబ్‌ను నడిపించారు. ఫిఫా మహిళల ఫుట్‌బాల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన తొలి భారతీయురాలీమె. 2025 నుంచి 2029 వరకు ఆ హోదాలో కొనసాగుతారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609